
వాస్తవాలు పలుకు DD9 వార్త

TGTEL/26/A2635

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి: 06 | సంచిక: 137 | 28-09-2026 | సోమవారం | పేజీలు: 10 | వెల: 3/-




భారీ వర్షాలతో ఉత్తరప్రదేశ్

అతలాకుతలం

- మూడు రోజులుగా ఎడతెరిపిలేని వర్షా లు 56 మంది మృతి
- 1,021 ఇళ్లు ధ్వంసం.. 107 మూగజీవాలు మృతి
- సీతాపూర్‌లో అత్యధికంగా ఏడు మరణాలు
- మూడు జిల్లాల్లో ఐదుగురు చొప్పున మృతి
- హర్దోయిలో 272 ఇళ్లు ధ్వంసం
- సగటు కంటే 775 శాతం అధిక వర్షపాతం

3



ప్రభుత్వ బడుల్లో

'టెక్' విద్య

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సాంకేతిక శిక్షణ
- కోడింగ్, రోబోటిక్స్‌పై ప్రాజెక్ట్ ఆధారిత విద్య
- ప్రత్యేక నైపుణ్యాలున్న అభ్యర్థుల ఎంపికకు కసరత్తు
- ఒక్కో ల్యాబ్‌లో రూ.10 లక్షల విలువైన పరికరాలు
- సైన్స్, మ్యాథ్స్‌పై ఆసక్తి పెంపొందించడమే లక్ష్యం
- టీచర్లకు ఇప్పటికే రోబోటిక్స్, డ్రోన్, 3డీ ప్రింటింగ్‌పై శిక్షణ
- ప్రత్యేక బోధకులతో ఏటీఎల్‌లకు మరింత ప్రయోజనం

2



2

జాతీయ భద్రతలో

రాజీ లేదు

- జాతీయ భద్రతపై రాజీ పడబోమన్న రక్షణ మంత్రి
- ఉగ్రవాదంపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం
- పాకిస్థాన్‌కు తీవ్ర హెచ్చరిక
- శాంతినే భారత్ కోరుకుంటోందని వెల్లడి
- యుద్ధం, ఇతర దేశాల భూభాగంపై భారత్‌కు ఆసక్తి లేదని వ్యాఖ్య
- మౌనాన్ని బలహీనతగా భావించొద్దని హెచ్చరిక
- ఉగ్ర చర్యలకు నిర్ణయాత్మకంగా స్పందిస్తామని స్పష్టం
- ఉరి దాడి తర్వాత సర్జికల్ దాడుల ప్రస్తావన
- పుల్వామా తర్వాత వైమానిక దాడులను గుర్తుచేసిన మంత్రి
- పహల్గాం తర్వాత 'ఆపరేషన్ సిందూర్'తో బదులిచ్చామన్న రాజ్‌నాథ్

రానే వచ్చె మినీ మేడారం..!



4



ఉగ్రవాదంపై రాజీ లేదు

- మనకీ బాత్ లో ప్రధాని మోదీ వెల్లడి
- భద్రత విషయంలో రాజీ ఉండదని స్పష్టం
- ఉగ్రదాడులకు తగిన జవాబు ఇస్తామని వెల్లడి
- సర్జికల్ దాడులకు పదేళ్లు పూర్తి
- 2016లో ఉగ్ర స్థావరాలపై సైనిక చర్య
- బాలాకోట్ నుంచి ఆపరేషన్ సిందూర్ వరకు
- సైనికుల ధైర్యసాహసాలకు ప్రధాని ప్రశంస
- దేశ రక్షణలో వారి త్యాగాలను గుర్తుంచుకోవాలని పిలుపు
- ఉగ్రవాదంపై దేశం ఐక్యంగా ఉండాలని సూచన
- ఆంధ్రప్రదేశ్‌లో యువత సేవలను ప్రస్తావించిన మోదీ

ఢిల్లీ, (డీడీ9వార్త):

ఉగ్రవాదంపై భారత్ శూన్యసహన విధానాన్ని అనుసరిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. దేశ భద్రతకు ముప్పు కలిగించే ఎలాంటి చర్యనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఆదివారం ప్రసారమైన 'మన్ కీ బాత్' 138వ భాగంలో ఉగ్రవాదంపై భారత్ అనుసరిస్తున్న విధానాన్ని వివరించారు. ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చే శక్తులపై కఠినంగా వ్యవహరిస్తామని, ఉగ్రదాడులకు భారత్ తగిన సమాధానం ఇస్తోందని పేర్కొన్నారు.

2016 సెప్టెంబర్ 28, 29 తేదీల్లో భారత సైన్యం పాకిస్థాన్‌లోని ఉగ్రవాద మిగతా 2 లో..

రేవంత్.. ఆధారాలు చూపించు

- భూ ఆరోపణలపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- 2,400 ఎకరాల రికవరీకి ఆధారాలు చూపాలి
- 8 వేల ఎకరాల వ్యవహారంపై స్పష్టత ఇవ్వాలి
- అసెంబ్లీలో చేసిన ఆరోపణలను ప్రజల ముందు పెట్టాలి
- సిరిసిల్ల నేత కార్మికుల బకాయిలు చెల్లించాలి
- రూ.60 కోట్ల పెండింగ్‌పై ప్రభుత్వం సమాధానం చెప్పాలి
- బతుకమ్మ చీరల పథకాన్ని ఎందుకు నిలిపివేశారో చెప్పాలి
- రైతు రుణమాఫీ బకాయిలపై స్పష్టత ఇవ్వాలి
- రైతు భరోసా బకాయిలను ఎప్పుడు చెల్లిస్తారో వెల్లడించాలి
- హామీల అమలుకు తేదీలు ప్రకటించాలని కేటీఆర్ డిమాండ్



హైదరాబాద్, (డీడీ9 వార్త):

సిరిసిల్ల పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఆదివారం బహిరంగ లేఖ రాశారు. సిరిసిల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం ఇచ్చిన హామీలు, భూ వ్యవహారాలపై సీఎం స్పష్టత ఇవ్వాలని కోరారు. అసెంబ్లీలో చేసిన భూ ఆరోపణలకు ఆధారాలను ప్రజల ముందు ఉంచాలని సవాల్ చేశారు. భూముల వ్యవహారంపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 8 వేల ఎకరాల భూముల మిగతా 2 లో..

దశాబ్దాల భూ సమస్యలకు పరిష్కారం

- పెండింగ్ భూ దరఖాస్తుల పరిష్కారానికి ఆదేశాలు
- అర్హత కేసుల క్రమబద్ధీకరణకు చర్యలు
- నాలుగు ప్రభుత్వ ఉత్తర్వుల పరిధిలో పరిశీలన
- అధికారులకు స్పష్టమైన ఆదేశాలు
- 2016 ఉత్తర్వులు అమలు కాలేదన్న పొంగులేటి
- అర్హత కేసుల పరిష్కారానికి శ్రీకారం
- నిషేధిత భూముల సమస్యలపైనా దృష్టి
- ఇళ్లు, స్థలాల రిజిస్ట్రేషన్లకు వెసులుబాటు
- మిగిలిన సమస్యల పరిష్కారానికి వేగం
- ప్రజల భూ సమస్యల పరిష్కారమే లక్ష్యమన్న మంత్రి

హైదరాబాద్, (డీడీ9 వార్త):

దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పట్టణ భూ పరిమితికి సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి, అర్హత ఉన్న కేసులను నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించాలని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసినట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రజల భూ సమస్యల పరిష్కారమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

పట్టణ భూ పరిమితికి సంబంధించిన నాలుగు ప్రభుత్వ ఉత్తర్వుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను అధికారులు పరిశీలించనున్నారు. నిబంధనల ప్రకారం అర్హత ఉన్న కేసులను గుర్తించి, క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోనున్నారు. దీంతో చాలా కాలంగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులకు ఊరట లభించే అవకాశం ఉంది.

2016లోనే ఈ భూ సమస్యల పరిష్కారానికి సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, గత ప్రభుత్వం వాటిని అమలు చేయలేదని మంత్రి పొంగులేటి ఆరోపించారు. ప్రస్తుతం అర్హత కలిగిన పెండింగ్ కేసులను పరిష్కరించే ప్రక్రియను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి దరఖాస్తును సంబంధిత నిబంధనలు, భూ రికార్డులు, ఇతర పత్రాలను మిగతా 2లో..



బీజేపీ ఓటు చోరీ చేసింది

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపణ
- దేశం రాహుల్ గాంధీ ప్రధాని కావాలని ఎదురుచూస్తోందని వ్యాఖ్య
- నిస్సందేహంగా రాహుల్ ప్రధాని అవుతారని ఉత్తమ్ ధీమా
- నేరేడుచర్లలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
- పేదలకు నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నామని వెల్లడి
- గతంలో దొడ్డు బియ్యం ఇచ్చేవారని మంత్రి విమర్శ
- కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం అందిస్తోందని వ్యాఖ్య
- బీఆర్ఎస్ హయాంలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని ఆరోపణ
- సూర్యాపేట జిల్లాలో మూడు లక్షలకుపైగా కొత్త కార్డులు
- రేషన్ కార్డులతో మూడు లక్షల మందికి ప్రయోజనం



హైదరాబాద్, (డీడీ9 వార్త):

సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బీజేపీపై, గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. బీజేపీ ఓటు చోరీ చేసి ప్రజలను మోసం చేసిందని ఆయన ఆరోపించారు. దేశ ప్రజలు రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని ఎదురుచూస్తున్నారని, రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని మిగతా 2 లో..

రైల్వే వ్యవస్థలో సమూల మార్పులు

- మోదీ పాలనలో రైల్వేల్లో ఆధునికీకరణ
- దేశంలో తొలి ఎల్ఎన్‌జీ రైలు ప్రారంభం
- సబర్మతి నుంచి రైలుకు పచ్చజెండా
- 40 శాతం డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా ఎల్ఎన్‌జీ
- రైల్వే విద్యుదీకరణలో భారీ పురోగతి
- డీజిల్ వినియోగం 108 కోట్ల లీటర్లకు తగ్గింపు
- 2030 నాటికి డీజిల్ వినియోగం సున్నాకు లక్ష్యం
- రైల్వే మౌలిక వసతుల విస్తరణ
- కాంగ్రెస్ పాలనపై అమిత్ షా విమర్శలు

ఢిల్లీ, (డీడీ9 వార్త):

దేశ రైల్వే వ్యవస్థను ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం సమూలంగా మార్చిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. గుజరాత్‌లోని సబర్మతి రైల్వేస్టేషన్ నుంచి దేశంలోనే తొలి ఎల్ఎన్‌జీ ఆధారిత ద్వంద్వ ఇంధన రైలును ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రైల్వేల్లో మిగతా 2లో..



రాహుల్ విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారు

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపాటు
- ఎన్నికల సంఘం నిబద్ధతను ప్రశ్నించడం సరికాదని వ్యాఖ్య
- రాహుల్‌ను ప్రధాని చేసేందుకు ఈసీ పనిచేయదని స్పష్టం
- కాంగ్రెస్ గెలిస్తే ఈసీ సరిగ్గా పనిచేసినట్టేనా?
- ఓడితేనే అక్రమాలు జరిగాయని అంటారా? అని ప్రశ్న
- ఎన్నికల సంఘాన్ని విమర్శించే హక్కు కాంగ్రెస్‌కు లేదని వ్యాఖ్య
- బీజేపీ, ప్రజాస్వామ్యంపై కాంగ్రెస్ విమర్శలు సరికాదని వెల్లడి
- కాంగ్రెస్ ఆరోపణలను ప్రజలు తిరస్కరిస్తున్నారని వ్యాఖ్య
- ఈసీ విషయంలో మిత్రపక్షాల తీరుపై అభ్యంతరం
- కాంగ్రెస్ ఆరోపణలపై కిషన్‌రెడ్డి మండిపాటు



హైదరాబాద్, (డీడీ9 వార్త):

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేయడాన్ని కేంద్ర మంత్రి, బీజేపీ నేత కిషన్‌రెడ్డి తప్పుబట్టారు. రాజ్యాంగబద్ధమైన ఎన్నికల సంఘం నిబద్ధతను ప్రశ్నిస్తూ రాహుల్ గాంధీ మాట్లాడుతున్న తీరు చూస్తే ఆయన విచక్షణ కోల్పోయినట్లు అనిపిస్తోందని మిగతా 2 లో..

ఉగ్రవాదంపై రాజీ లేదు

మొదటిపేజీ తరువాయి

స్థావరాలపై సర్జికల్ దాడులు నిర్వహించి పదేళ్లు పూర్తవుతున్నాయని ప్రధాని గుర్తుచేశారు. నియంత్రణ రేఖను దాటి సైనికులు ఉగ్రవాదంపై చర్యలు చేపట్టారని తెలిపారు. ఈ దాడులు భారత ఉగ్రవాద వ్యతిరేక విధానానికి కొత్త దిశను చూపించాయని పేర్కొన్నారు.

గత దశాబ్దంలో బాలాకోట్ వైమానిక దాడి నుంచి ఆపరేషన్ సిందూర్ వరకు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ పలు సందర్భాల్లో తన వైఖరిని స్పష్టం చేసిందని మోదీ అన్నారు. భారత్‌పై ఉగ్రవాదులు దాడికి పాల్పడితే తగిన జవాబు ఉంటుందని పేర్కొన్నారు.

ఉగ్రవాదంపై పోరులో సాయుధ బలగాల ధైర్యసాహసాలను ప్రధాని ప్రశంసించారు. దేశ రక్షణ కోసం వారు చేసిన త్యాగాలను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకోవాలని అన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విషయంలో దేశం ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.

ఇదే కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌లో యువత చేపడుతున్న పురాతన బావుల శుభ్రత కార్యక్రమాన్ని కూడా మోదీ ప్రస్తావించారు. యువత పాత మెట్ల బావులు, ఇతర బావులను శుభ్రం చేస్తూ పురాతన వారసత్వాన్ని పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి ప్రయత్నాలు మన చరిత్ర, వారసత్వాన్ని మరింతగా అర్థం చేసుకోవడానికి దోహదపడతాయని పేర్కొన్నారు.

దశాబ్దాల భూ సమస్యలకు పరిష్కారం

మొదటిపేజీ తరువాయి

పరిశీలించిన తర్వాతే నిర్ణయిస్తారని మంత్రి స్పష్టం చేశారు. అర్హత ఉన్న కేసులకు మాత్రమే క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించనున్నారు.

నిషేధిత భూముల జాబితాలో ఉన్న ఆస్తుల సమస్యలపైనా ప్రభుత్వం దృష్టి పెట్టిందని పొంగులేటి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా ఈ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని చెప్పారు.

ఇప్పటికే కొన్ని ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నామని మంత్రి వెల్లడించారు. నిషేధిత జాబితాలో ఉన్నప్పటికీ సంబంధిత అనుమతులు కలిగిన ఇళ్లు, స్థలాలు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించినట్లు తెలిపారు.

మిగిలిన నిషేధిత భూముల సమస్యలను కూడా వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి స్పష్టం చేశారు. భూ రికార్డులు, హక్కులు, రిజిస్ట్రేషన్లకు సంబంధించిన సమస్యలను నిబంధనల మేరకు పరిష్కరించనున్నట్లు తెలిపారు.

భూ సమస్యలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండటంతో ఆస్తుల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు, రుణాల విషయంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అర్హత ఉన్న దరఖాస్తులను పరిష్కరించేందుకు ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది.

భూ రికార్డుల నిర్వహణ, హక్కుల నిర్ధారణ, రిజిస్ట్రేషన్లకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన భూ భారతి కార్యక్రమం ద్వారా కూడా సేవలు అందుతున్నాయి. భూ రికార్డుల్లో సమస్యలను సరిచేయడం, ప్రజలకు భూములపై స్పష్టత కల్పించడం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించింది.

దశాబ్దాలుగా పరిష్కారం కోసం ఎదురు చూస్తున్న భూ దరఖాస్తులపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అర్హులైన భూ యజమానులకు ప్రయోజనం కలగనుంది. అయితే ప్రతి కేసును పూర్తిగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోనున్నారు. ప్రజల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ప్రభుత్వ బడుల్లో 'టెక్' విద్య

- **ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సాంకేతిక శిక్షణ**
- **కోడింగ్, రోబోటిక్స్‌పై ప్రాజెక్ట్ ఆధారిత విద్య**
- **ప్రత్యేక నైపుణ్యాలున్న అభ్యర్థుల ఎంపికకు కసరత్తు**
- **ఒక్కో ల్యాబ్‌లో రూ.10 లక్షల విలువైన పరికరాలు**
- **సైన్స్, మ్యాథ్స్‌పై ఆసక్తి పెంపొందించడమే లక్ష్యం**
- **టీచర్లకు ఇప్పటికే రోబోటిక్స్, డ్రోన్, 3డీ ప్రింటింగ్‌పై శిక్షణ**
- **ప్రత్యేక బోధకులతో ఏటీఎల్‌లకు మరింత ప్రయోజనం**
- **విద్యార్థుల్లో సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలే లక్ష్యం**

హైదరాబాద్, (డీడీ9 వార్త):


ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్స్ (ఏటీఎల్) నిర్వహణకు ఇన్‌స్ట్రక్టర్ల (బోధకుల) భర్తీకి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. విద్యార్థులకు కోడింగ్, రోబోటిక్స్, తదితర ప్రాజెక్ట్ ఆధారిత విద్యలో శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో సైన్స్, గణితం (మ్యాథ్స్) సబ్జెక్టులపై ప్రత్యేక ఆసక్తిని పెంపొందించేందుకు పీఎంశ్రీ స్కూళ్లలో అటల్ టింకరింగ్ ల్యాబ్(ఏటీఎల్)లను ఏర్పాటు చేశారు. ఇందులో ప్రతి ఏటీఎల్ లో రూ.10లక్షల విలువైన రోబోటిక్స్‌తో పాటు ఆధునిక ప్రయోగ పరికరాలను అందించారు. వీటిని ఏ విధంగా వినియోగించాలో సైన్స్ టీచర్లకు గతంలో శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో డయోడ్స్ కెపాసిటర్లు, బ్రెడ్ బోర్డును ఉపయోగించి సర్క్యూట్ల తయారీ, ప్రోగ్రామ్‌లను ఫోన్‌తో అనుసంధానం చేయడంతో పాటు సమూనా రోబోటిక్స్‌లను విడిభాగాలతో తయారు చేయించి ఆపరేట్ చేయడం, త్రీడీ ముద్రణ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. అయితే టీచర్లే కాకుండా సంబంధిత విషయాల్లో స్పెషలైజేషన్ ఉన్న అభ్యర్థులను ఎంపిక చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్స్ (ఏటీఎల్) నిర్వహణకు ఉపయోగిస్తే మరిన్ని మెరుగైన ఫలితాలు సాధించవచ్చని విద్యాశాఖ భావిస్తోంది.

రూ.18వేల వేతనం..

ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక నైపుణ్యాలను అందుబాటులోకి తెచ్చి, వారికి ప్రాక్టికల్ విజ్ఞానాన్ని అందించడమే లక్ష్యంగా ప్రత్యేక ఇన్‌స్ట్రక్టర్లను భర్తీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ పోస్టుకు బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ కనీస విద్యార్హతగా నిర్ణయించారు. ఎంపికైన ఇన్‌స్ట్రక్టర్లకు నెలకు రూ.18వేల గౌరవ వేతనం చెల్లించనున్నారు. ఇది ప్రాజెక్ట్ ఆధారిత పథకం కావడంతో, అభ్యర్థులకు ఎలాంటి రాత పరీక్ష నిర్వహించట్లేదని అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థులకు ప్రాక్టికల్ ప్రాజెక్టులపై మార్గదర్శనం చేసేందుకు తగిన అర్హత, నైపుణ్యం కలిగిన వారిని నియమించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు, దరఖాస్తు ప్రక్రియ త్వరలోనే వెల్లడికానున్నాయి

జపాన్ స్ఫూర్తితో..

ఇటీవల జపాన్‌ను సందర్శించిన విద్యాశాఖ అధికారులు, టీచర్లు అక్కడి విద్యావిధానంలో థియరీ కంటే ప్రాక్టికల్స్ (ప్రయోగాత్మక బోధన)కు ఇస్తున్న ప్రాధాన్యతను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థులకు కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా ప్రయోగాల ద్వారా నేర్పించడం వల్ల సబ్జెక్టుపై పట్టు సాధించవచ్చని గుర్తించారు. ఆ తరహా ప్రాక్టికల్ విధానాన్ని రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలోనూ విరివిగా అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు కోడింగ్, రోబోటిక్స్, త్రీడీ ప్రింటింగ్, డిజైన్ థింకింగ్ వంటి ఆధునిక సాంకేతిక అంశాల్లో శిక్షణ ఇవ్వడం ద్వారా వారిలో పరిశోధనాత్మక ఆలోచనలను పెంపొందించవచ్చని అధికారులు భావిస్తున్నారు. త్వరలోనే ఈ ఇన్‌స్ట్రక్టర్ల నియామక ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలు వెలువడే అవకాశముంది.



రేవంత్.. ఆధారాలు చూపించు

మొదటిపేజీ తరువాయి

వ్యవహారానికి సంబంధించి ప్రభుత్వం చేసిన ఆరోపణలపై కేటీఆర్ ప్రశ్నలు సంధించారు. అందులో 2,400 ఎకరాలను రికవరీ చేసినట్లు ప్రభుత్వం పేర్కొంటున్న నేపథ్యంలో.. ఆ భూములు ఎక్కడ ఉన్నాయి, వాటికి సంబంధించిన వివరాలు, రికవరీకి ఆధారాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. సర్వే నంబర్లు, గ్రామాలు, మండలాల వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

భూ ఆరోపణలను నిరూపించలేకపోతే ప్రభుత్వం ప్రజలకు వివరణ ఇవ్వాలని కేటీఆర్ లేఖలో పేర్కొన్నట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. గతంలోనూ సిరిసిల్ల భూముల అంశంపై కేటీఆర్ ఇదే తరహాలో అధికారిక వివరాలను బహిర్గతం చేయాలని కోరారు. ఈ ఆరోపణలు, ప్రత్యారోపణలపై సంబంధిత విచారణ, చట్టపరమైన ప్రక్రియలో తుది నిర్ధారణ జరగాల్సి ఉంది. చేనేత రంగం విషయంలోనూ కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బతుకమ్మ చీరల పంపిణీ పథకాన్ని ఎందుకు నిలిపివేశారో ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరారు. సిరిసిల్ల నేత కార్మికులకు చెల్లించాల్సిన రూ.60 కోట్ల పెండింగ్ బకాయిలను ఎప్పుడు విడుదల చేస్తారో ప్రకటించాలని డిమాండ్ చేశారు.

రైతుల సమస్యలపైనా కేటీఆర్ పలు ప్రశ్నలు సంధించారు. రూ.2 లక్షల రైతు రుణమాఫీ ప్రక్రియను ఎప్పటిలోగా పూర్తి చేస్తారో వెల్లడించాలని కోరారు. రైతు భరోసా బకాయిలపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు సంబంధించిన హామీలు, రైతుబీమా వంటి అంశాలపై కూడా తేదీలతో కూడిన సమాధానం ఇవ్వాలని కోరినట్లు తాజా కథనాలు పేర్కొన్నాయి.

సిరిసిల్ల నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన అంశాలను కూడా కేటీఆర్ లేఖలో ప్రస్తావించారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన అభివృద్ధి పనుల బకాయిలను విడుదల చేయాలని కోరారు. జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలకు నిధులు, 'మన ఊరు-మన బడి' పనులకు సంబంధించిన పెండింగ్ బకాయిలు, కొత్త పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ జోన్, ఆక్వా హబ్ వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి.

ఆరు గ్యారెంటీల అమలుపైనా కేటీఆర్ ప్రశ్నలు సంధించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం స్పష్టమైన తేదీలను ప్రకటించాలని కోరారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం, ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం, ఆసరా పెన్షన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర అంశాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఇదిలా ఉండగా, సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 30న సిరిసిల్లలో పర్యటించేందుకు కాంగ్రెస్ పార్టీ ఏర్పాట్లు చేస్తోంది. భారీ బహిరంగ సభతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేలా ఏర్పాట్లు జరుగుతున్నట్లు తాజా వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో కేటీఆర్ బహిరంగ లేఖ రాయడం సిరిసిల్ల పర్యటనకు రాజకీయ ప్రాధాన్యం తీసుకొచ్చింది.

సిరిసిల్లలో సీఎం పర్యటన సందర్భంగా భూ వ్యవహారాలు, చేనేత రంగం, రైతుల సమస్యలు, అభివృద్ధి పనులు, ఎన్నికల హామీల అమలు వంటి అంశాలపై రేవంత్‌రెడ్డి ఏం మాట్లాడతారన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు కేటీఆర్ లేవనెత్తిన అంశాలపై ప్రభుత్వం నుంచి వచ్చే సమాధానాలపై కూడా రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ప్రస్తుతం ఇరుపక్షాల మధ్య ఉన్న భూ ఆరోపణలు రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణల దశలో ఉండగా.. సంబంధిత విచారణలు, అధికారిక రికార్డులు, చట్టపరమైన ప్రక్రియ ఆధారంగానే వాటిపై తుది నిర్ధారణ జరగాల్సి ఉంటుంది.

రాహుల్ విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారు

మొదటిపేజీ తరువాయి



వ్యాఖ్యానించారు.

ఎన్నికల సంఘం ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా పనిచేయాల్సిన అవసరం లేదని కిషన్‌రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు ఎన్నికల సంఘం పనిచేయదని గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా తన విధులను నిర్వహిస్తుందని తెలిపారు.

ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తే ఎన్నికల సంఘం సక్రమంగా పనిచేసినట్లు, అదే పార్టీ ఓటమి పాలైతే ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించడం ఏ విధంగా సమర్థనీయమని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల ఫలితాలను బట్టి ఎన్నికల సంఘం పనితీరును అంచనా వేయడం సరికాదని వ్యాఖ్యానించారు.

బీజేపీని, ప్రజాస్వామ్యాన్ని, ఎన్నికల సంఘాన్ని విమర్శించే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఎన్నికల సంఘం పనితీరుపై కాంగ్రెస్, రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలను ప్రజలు అసహ్యించుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సంఘానికి సంబంధించిన అంశంలో కాంగ్రెస్‌కు మద్దతుగా మాట్లాడుతున్న మిత్రపక్షాల తీరుపైనా కిషన్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికల వ్యవస్థపై అనుమానాలు వ్యక్తం చేసే ముందు అందుబాటులో ఉన్న వాస్తవాలు, ఆధారాలను పరిశీలించాలని సూచించారు. ఎన్నికల సంఘం పనితీరుపై కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో దేశ రాజకీయాల్లో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు బీజేపీ నేతలు కాంగ్రెస్ ఆరోపణలను ఖండిస్తూ ఎన్నికల సంఘంపై విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సంఘం స్వతంత్రత, ఓటరు జాబితాలు, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

రైల్వే వ్యవస్థలో సమూల మార్పులు

మొదటిపేజీ తరువాయి

గత 12 ఏళ్లలో చేపట్టిన ఆధునికీకరణ, విద్యుదీకరణ, మౌలిక వసతుల అభివృద్ధిని వివరించారు.

2014లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైల్వే వ్యవస్థలో అనేక కొత్త సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని అమిత్ షా అన్నారు. ప్రత్యేక సరకు రవాణా మార్గాలు, వేగవంతమైన రైలు వ్యవస్థలు, ఆధునిక రైల్వేస్టేషన్ల నిర్మాణం వంటి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. అధునాతన సాంకేతికతను వినియోగిస్తూ రైల్వే భద్రత, రవాణా సామర్థ్యాన్ని పెంచుతున్నామని పేర్కొన్నారు. రైల్వేల్లో డీజిల్ వినియోగం గణనీయంగా తగ్గిందని అమిత్ షా తెలిపారు. 201516లో 293 కోట్ల లీటర్లుగా ఉన్న డీజిల్ వినియోగం 202425 నాటికి 108 కోట్ల లీటర్లకు తగ్గిందన్నారు. 2030 నాటికి డీజిల్ వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు.

201011లో ఏడాదికి సగటున 75 కిలోమీటర్ల మేర రైల్వే మార్గాల విద్యుదీకరణ జరిగేదని, 202324 నాటికి అది 7,188 కిలోమీటర్లకు పెరిగిందని అమిత్ షా వెల్లడించారు. దేశవ్యాప్తంగా 99.6 శాతం రైల్వే నెట్‌వర్క్ విద్యుదీకరణ పూర్తయిందని తెలిపారు.

సబర్మతి నుంచి ప్రారంభించిన కొత్త రైలు పూర్తిగా ఎల్ఎన్‌జీతో కాకుండా ఎల్ఎన్‌జీ, డీజిల్ రెండింటితో నడిచే విధంగా రూపొందించారు. రైలులోని రెండు శక్తి ఇంజిన్లను ఈ ద్వంద్వ ఇంధన విధానానికి మార్చారు. ఎల్ఎన్‌జీ వినియోగం ద్వారా డీజిల్ అవసరాన్ని సుమారు 40 శాతం వరకు తగ్గించవచ్చని రైల్వే అధికారులు తెలిపారు. ఇంధన వ్యయం, డీజిల్ వినియోగం, కాలుష్య ఉద్గారాలను తగ్గించడం ఈ ప్రయోగం ప్రధాన ఉద్దేశం.

ఈ రైలుకు సంబంధించిన రెండు శక్తి ఇంజిన్ల పై 2,000 కిలోమీటర్లకు పైగా ప్రయోగాత్మక ప్రయాణాలు నిర్వహించినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ఎనిమిది బోగీల రైలుకు ఏడాదికి సుమారు రూ.23.9 లక్షల వరకు ఇంధన వ్యయం ఆదా కావచ్చని అంచనా వేశారు.

రైల్వే అభివృద్ధితో పాటు కాంగ్రెస్ పాలనపై అమిత్ షా విమర్శలు చేశారు. కాంగ్రెస్ పాలనలో కుంభకోణాలు తప్ప మరేమీ జరగలేదని ఆరోపించారు. గత 12 ఏళ్లలో ప్రధాని నరేంద్ర మోదీపై ఎవరూ అవినీతి ఆరోపణలు చేయలేకపోయారని అన్నారు. కాంగ్రెస్ విమర్శలను వాస్తవాలు, గణాంకాల ఆధారంగా చర్చించాలని సవాలు చేశారు. సబర్మతి కార్యక్రమంలో ఎల్ఎన్‌జీ రైలుతో పాటు పలు రైల్వే అభివృద్ధి ప్రాజెక్టులను కూడా అమిత్ షా ప్రారంభించారు. మొత్తం రూ.1,542 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు సంబంధించిన కార్యక్రమాలు చేపట్టినట్లు అధికారిక ప్రసార సంస్థ తెలిపింది.

బీజేపీ ఓటు చోరీ చేసింది

మొదటిపేజీ తరువాయి

వ్యాఖ్యానించారు. ఓటరు జాబితాలు, ఎన్నికల ప్రక్రియపై కాంగ్రెస్ నేతలు ఇటీవల బీజేపీ, ఎన్నికల సంఘంపై చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఉత్తమ్ వ్యాఖ్యలు చేశారు.

నేరేడుచర్ల మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, ఎస్పీ నరసింహ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు నాణ్యమైన సన్నబియ్యం అందిస్తోందని తెలిపారు. అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డుల ద్వారా నిత్యావసర సరుకులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

పేదలకు నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గతంలో పేదలకు నాణ్యత లేని దొడ్డు బియ్యం పంపిణీ చేసేవారని, వాటిని కొందరు లబ్ధిదారులు వినియోగించకుండా విక్రయించేవారని ఆయన విమర్శించారు. ప్రస్తుతం తెలంగాణలో పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉన్నప్పటికీ, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు సన్నబియ్యం అందిస్తోందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారు 90 శాతం మంది పేదలు సన్నబియ్యం తింటున్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. పేద కుటుంబాలకు అందించే రేషన్ బియ్యం నాణ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేస్తోందని వివరించారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత సమర్థంగా అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ కార్డుల జారీపై కూడా మంత్రి విమర్శలు చేశారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. కొత్త కుటుంబాలు ఏర్పడినా, కుటుంబ సభ్యుల సంఖ్య పెరిగినా కొత్త కార్డుల జారీపై గత ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఇదే అంశంపై గతంలోనూ ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శలు చేసినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 16.32 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు మంత్రి గతంలో వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య కోటికిపైగా ఉందని సంబంధిత ప్రకటనల్లో పేర్కొన్నారు. ప్రతి అర్హ కుటుంబానికి రేషన్ కార్డు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

సూర్యాపేట జిల్లాలో మూడు లక్షలకుపైగా కొత్త రేషన్ కార్డులు అందిస్తున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాంతంలో కొత్తగా లక్షకుపైగా కార్డులు అందించామని, వాటి ద్వారా సుమారు మూడు లక్షల మంది లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలో సుమారు పది లక్షల మంది సన్నబియ్యం పొందుతున్నారని కూడా మంత్రి వెల్లడించారు.

మంత్రి తన ప్రసంగంలో రాజకీయ అంశాలను కూడా ప్రస్తావించారు. బీజేపీ ఓటు చోరీ చేసి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ఓటరు జాబితాల సవరణ, ప్రత్యేక సమగ్ర పునర్విమర్శ (SIR), ఎన్నికల సంఘం పనితీరుపై కాంగ్రెస్ నేతలు ఇటీవల తీవ్ర విమర్శలు చేస్తున్నారు. రాహుల్ గాంధీ కూడా సెప్టెంబర్ 24న ఓటు చోరీ, చట్టాల చోరీ అంటూ ఎన్నికల ప్రక్రియపై ఆరోపణలు చేశారు. బీజేపీ మాత్రం ఆ ఆరోపణలను నిరాధారమైనవిగా ఖండించింది.

రాహుల్ గాంధీ ప్రధాని కావాలని దేశం ఎదురుచూస్తోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ ప్రధాని కావడం నిస్సందేహమని ఆయన అన్నారు. ఇది మంత్రి చేసిన రాజకీయ వ్యాఖ్య కాగా, రాబోయే ఎన్నికల ఫలితాలపై ముందస్తు నిర్ధారణగా పరిగణించలేం.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో పాటు నేరేడుచర్ల పరిసర ప్రాంతాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లోనూ మంత్రి పాల్గొన్నారు. సెప్టెంబర్ 27, 28 తేదీల్లో హుజూర్‌నగర్, మిర్యాలగూడ, సూర్యాపేట ప్రాంతాల్లో రేషన్ కార్డుల



పంపిణీతో పాటు పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు నిర్వహించేందుకు మంత్రి పర్యటనకు సంబంధించిన కార్యక్రమాలు ఖరారైనట్లు ముందస్తు సమాచారం వెల్లడించింది.

పేదలకు రేషన్ కార్డులు, నాణ్యమైన బియ్యం పంపిణీ, కొత్త లబ్ధిదారుల చేర్పు వంటి అంశాలను ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలుగా ముందుకు తీసుకెళ్తుండగా.. రేషన్ కార్డుల జారీపై గత ప్రభుత్వ పనితీరును కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయంగా ప్రశ్నిస్తోంది. మరోవైపు ఎన్నికల ప్రక్రియ, ఓటరు జాబితాలపై కాంగ్రెస్, బీజేపీ మధ్య ఆరోపణలుప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో నేరేడుచర్లలో ఉత్తమ్ కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

జాతీయ భద్రతలో రాజీ లేదు

- **జాతీయ భద్రతపై రాజీ పడబోమన్న రక్షణ మంత్రి**
- **ఉగ్రవాదంపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం**
- **పాకిస్థాన్‌కు తీవ్ర హెచ్చరిక**
- **శాంతినే భారత్ కోరుకుంటోందని వెల్లడి**
- **యుద్ధం, ఇతర దేశాల భూభాగంపై భారత్‌కు ఆసక్తి లేదని వ్యాఖ్య**
- **మౌనాన్ని బలహీనతగా భావించొద్దని హెచ్చరిక**
- **ఉగ్ర చర్యలకు నిర్ణయాత్మకంగా స్పందిస్తామని స్పష్టం**
- **ఉరి దాడి తర్వాత సర్జికల్ దాడుల ప్రస్తావన**
- **పుల్వామా తర్వాత వైమానిక దాడులను గుర్తుచేసిన మంత్రి**
- **పహల్గాం తర్వాత 'ఆపరేషన్ సిందూర్'తో బదులిచ్చామన్న రాజ్‌నాథ్**

ఢిల్లీ, (డీడీ9 వార్త):

జాతీయ భద్రత విషయంలో భారత్ ఎన్నడూ రాజీపడబోదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే చర్యలకు పాల్పడితే తగిన రీతిలో స్పందిస్తామని పాకిస్థాన్‌ను హెచ్చరించారు. భారత్ శాంతినే కోరుకుంటుందని, యుద్ధం చేయడం లేదా మరో దేశ భూభాగాన్ని ఆక్రమించడం తమ విధానం కాదని పేర్కొన్నారు. అయితే భారత్ మౌనాన్ని బలహీనతగా భావిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. సెప్టెంబర్ 27న నిర్వహించిన జాతీయ భద్రతకు సంబంధించిన కార్యక్రమంలో రాజ్‌నాథ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఏదైనా సమస్య పరిష్కారానికి భారత్ ముందుగా చర్చలనే మార్గంగా ఎంచుకుంటుందని రాజ్‌నాథ్ తెలిపారు. అయితే దేశ ప్రజలకు హాని కలిగించే చర్యలు, ఉగ్రవాద కార్యకలాపాలకు ప్రోత్సాహం కొనసాగితే చర్చలకు అవకాశం ఉండదన్నారు. అలాంటి పరిస్థితుల్లో భారత స్పందన నిర్ణయాత్మకంగా ఉంటుందని పేర్కొన్నారు.

ఉరి దాడి తర్వాత సర్జికల్ దాడులు, పుల్వామా దాడి తర్వాత వైమానిక దాడులు, పహల్గాం ఉగ్రదాడి అనంతరం 'ఆపరేషన్ సిందూర్' వంటి చర్యలను ఈ సందర్భంగా రాజ్‌నాథ్ ప్రస్తావించారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విషయంలో భారత్ తన విధానాన్ని మరింత కఠినతరం చేసిందని ఆయన గతంలోనూ స్పష్టం చేశారు. పాకిస్థాన్ నుంచి ఉగ్రదాడి జరిగితే దాన్ని భారతదేశంపై యుద్ధ చర్యగా పరిగణిస్తామని రాజ్‌నాథ్ సెప్టెంబర్ 24న మరో కార్యక్రమంలో పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విషయంలో భారత్ రక్షణ సామర్థ్యాలను, దౌత్యపరమైన చర్యలను సమాంతరంగా కొనసాగిస్తోందని తెలిపారు.

భారీ వర్షా లతో ఉత్తరప్రదేశ్ అతలాకుతలం

- **మూడు రోజులుగా ఎడతెరిపిలేని వర్షా లు 56 మంది మృతి**
- **1,021 ఇళ్లు ధ్వంసం.. 107 మూగజీవాలు మృతి**
- **సీతాపూర్‌లో అత్యధికంగా ఏడు మరణాలు**
- **మూడు జిల్లాల్లో ఐదుగురు చొప్పున మృతి**
- **హర్దోయిలో 272 ఇళ్లు ధ్వంసం**
- **సగటు కంటే 775 శాతం అధిక వర్షపాతం**

ఉత్తరప్రదేశ్, (డిడి9 వార్త):

ఉత్తరప్రదేశ్‌ను భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలు, ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో పలు ప్రాంతాల్లో తీవ్ర నష్టం సంభవించింది. ఇప్పటివరకు 56 మంది ప్రాణాలు కోల్పోగా.. 46 మంది గాయపడ్డారు. 107 మూగజీవాలు మృతి చెందాయి. 1,021 ఇళ్లు దెబ్బతిన్నట్లు రాష్ట్ర సహాయ కమిషనర్ కార్యాలయం వెల్లడించింది.

భారీ వర్షాలకు అత్యధికంగా సీతాపూర్ జిల్లా ప్రభావితమైంది. అక్కడ ఏడుగురు మృతి చెందారు. లఖింపూర్ ఖేరి, బహ్రైచ్, బలరాంపూర్ జిల్లాల్లో ఐదుగురు చొప్పున ప్రాణాలు కోల్పోయారు. అయోధ్య, గోరఖ్‌పూర్ జిల్లాల్లో నలుగురు చొప్పున మృతి చెందారు. ఇతర జిల్లాల్లోనూ వర్షం, వరదలు, పిడుగులు, ఇళ్ల కూలిపోవడం వంటి ఘటనల్లో ప్రాణనష్టం సంభవించింది.

ఇళ్ల ధ్వంసంలో హర్దోయీ జిల్లా ముందంజలో ఉంది. అక్కడ 272 ఇళ్లు దెబ్బతిన్నాయి. సీతాపూర్‌లో 108 ఇళ్లు ధ్వంసమయ్యాయి. చందౌలీ, ఔరయ్యా, గోండా, హమీర్‌పూర్, షాజహాన్‌పూర్, బహ్రైచ్ జిల్లాల్లోనూ పెద్ద సంఖ్యలో ఇళ్లు దెబ్బతిన్నాయి. భారీ వర్షాలకు పంటలకు కూడా నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు.

మూగజీవాలపైనా వర్ష ప్రభావం తీవ్రంగా పడింది. రాష్ట్రవ్యాప్తంగా 107 మూగజీవాలు మృతి చెందినట్లు అధికారిక గణాంకాలు వెల్లడించాయి. హర్దోయిలో అత్యధికంగా 28 మూగజీవాలు మృతి చెందగా.. సీతాపూర్‌లో 16, కన్నౌజ్‌లో 14, బహ్రైచ్‌లో ఏడు, కాన్పూర్ దేహాత్‌లో ఏడు, ఉన్నావ్‌లో ఆరు మూగజీవాలు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు.

వర్షపాతం కూడా సాధారణం కంటే భారీగా నమోదైంది. శుక్రవారం నుంచి ఆదివారం వరకు రాష్ట్రంలో సగటున 66.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణంగా ఇదే సమయంలో 7.6 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదవుతుంది. అంటే సాధారణం కంటే ఏకంగా 775 శాతం అధిక వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలోని 75 జిల్లాల్లో 56 జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ఫరూఖాబాద్‌లో సాధారణం కంటే 7,385 శాతం అధిక వర్షపాతం నమోదైంది. కన్నౌజ్‌లో 5,664 శాతం, షాజహాన్‌పూర్‌లో 4,408 శాతం, హమీర్‌పూర్‌లో 4,240 శాతం, మహోబాలో 4,100 శాతం అధిక వర్షపాతం నమోదైనట్లు రాష్ట్ర సహాయ కమిషనర్ కార్యాలయం తెలిపింది.



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం భూభాగంలోకి ప్రవేశించడంతో వర్షాలు తీవ్రరూపం దాల్చినట్లు అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. కొన్ని ప్రాంతాల్లో వరద పరిస్థితులు ఏర్పడి సాధారణ జనజీవనం స్తంభించింది.

భారీ వర్షాల కారణంగా రహదారులపై నీరు నిలిచిపోయింది. పలు ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పంటలు దెబ్బతినడంతో రైతులు నష్టపోయారు. పంట నష్టంపై పూర్తి అంచనా ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. సహాయ, పునరావాస చర్యలు కొనసాగుతున్నాయి.

మరోవైపు మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. సెప్టెంబర్ 27న తూర్పు ఉత్తరప్రదేశ్‌లో భారీ వర్షాలు, ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులకు అవకాశం ఉందని పేర్కొంది. పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోనూ అతి భారీ వర్షాలకు అవకాశం ఉన్నట్లు హెచ్చరించింది. సెప్టెంబర్ 28 తర్వాత రాష్ట్రానికి ప్రత్యేక వర్ష హెచ్చరికలు లేవని తాజా సూచనల్లో పేర్కొంది.

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితులకు తక్షణ సహాయం అందించాలని రాష్ట్ర సహాయ కమిషనర్ ఆదేశించారు. సహాయ, రక్షణ చర్యల్లో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ప్రభావిత కుటుంబాలను అధికారులు నేరుగా కలిసి అవసరమైన సహాయం అందించాలని సూచించారు.

ఇప్పటికే భారీ వర్షాలతో తీవ్రంగా దెబ్బతిన్న ఉత్తరప్రదేశ్‌లో ప్రాణ, ఆస్తి నష్టం పెరుగుతోంది. వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. పంట నష్టం, ఇళ్ల నష్టం, ఇతర ఆస్తి నష్టంపై పూర్తి వివరాలు సేకరించిన తర్వాత మరింత స్పష్టమైన గణాంకాలు వెలువడే అవకాశం ఉంది.

బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు

- **వారానికి ఐదు రోజుల పని విధానాన్ని వెంటనే అమలు చేయాలి: కడారి సునీల్**

పెద్దపల్లి బ్యూరో, సెప్టెంబరు 27 (డీడీ9 వార్త):



బ్యాంకు ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో చేపట్టనున్న మూడు రోజుల దేశవ్యాప్త సమ్మెకు ఏఐటీయూసీ పెద్దపల్లి జిల్లా సమితి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..., బ్యాంకు ఉద్యోగులు చాలాకాలంగా వారానికి ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. బ్యాంకింగ్ రంగంలో పెరుగుతున్న పని గంటలు, అధిక పనిభారం, నిరంతర లక్ష్యాల ఒత్తిడి కారణంగా ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. ఉద్యోగుల ఆరోగ్యం, కుటుంబ జీవితం, పని-జీవిత సమతుల్యతను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ఐదు రోజుల పని విధానాన్ని ఎలాంటి ఆలస్యం లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ రంగ బ్యాంకులను బలోపేతం చేయడంతో పాటు, బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసి సిబ్బంది కొరతను నివారించాలని కడారి సునీల్ కోరారు. అధిక లక్ష్యాల పేరుతో ఉద్యోగులపై ఒత్తిడి, వేధింపులు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.

ప్రభుత్వ రంగ బ్యాంకుల పరిరక్షణ, ప్రజల సొమ్ముకు భద్రత, బ్యాంకు ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 28 నుంచి ప్రారంభమయ్యే 72 గంటల దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేసేందుకు పెద్దపల్లి జిల్లాలోని కార్మికవర్గం, ఉద్యోగులు బ్యాంకు ఉద్యోగులకు అండగా నిలవాలని కడారి సునీల్ పిలుపునిచ్చారు.

రెండోసారి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా డేగల వేలాద్రి

- **ప్రెస్ క్లబ్ కార్యదర్శిగా మాగి ముఖేష్ ఎన్నిక**
- **బోనకల్ మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక**

బోనకల్,సెప్టెంబర్ 27, (డీడీ9 వార్త):



బోనకల్ మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ప్రెస్ క్లబ్ సభ్యుల సమావేశంలో ఎన్నికల ప్రక్రియను సీనియర్ జర్నలిస్ట్ శ్రీనివాస్ రాథోడ్ నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డేగల వేలాద్రి వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు.

నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షులుగా కొణతాపల్లి నాగేశ్వరరావు, షేక్ మదార్ సాహెబ్, ప్రధాన కార్యదర్శిగా మాగి ముఖేష్, సహాయ కార్యదర్శిగా నాగటి రాజశేఖర్,కోశాధికారిగా షేక్ పెంటు సాహెబ్, గౌరవ సలహాదారుగా యంగల అమర్ ఎన్నికయ్యారు.కార్యవర్గ సభ్యులుగా షేక్ బాజీ షరీఫ్, యంగల గౌతం, తెల్లబోయిన సుమన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు డేగల వేలాద్రి మాట్లాడుతూ జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. జర్నలిస్టుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ప్రెస్ క్లబ్ చురుకైన పాత్ర పోషిస్తుందని తెలిపారు. తనపై నమ్మకంతో రెండోసారి అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. నూతన కార్యవర్గానికి పలువురు జర్నలిస్టులు అభినందనలు తెలిపారు.




షార్ట్ సర్క్యూట్ బి ఎస్ ఎన్ ఎల్ టవర్ లో మంటలు..


- **మండలంలో నిలిచిన కమ్యూనికేషన్ సేవలు**
- **పిచ్చి మొక్కలు మూసుకుపోవడమే కారణం**
- **బాహ్య ప్రపంచంతో సంబంధాలు కట్**


కన్నాయిగూడెం, సెప్టెంబర్ 27(డిడి9 వార్త):

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండల కేంద్రంలో ఉన్న బీఎస్ఎన్ఎల్ టవల్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆదివారం ఉదయం 6:30 నిమిషాలకు కాలిపోవటం జరిగింది. స్థానికులు గమనించి పోలీస్, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పారు..టవర్ ఆవరణలో ఉన్న కంటైనర్ మాత్రమే కాలిపోయిందా టవర్ కి కూడా ఏమైనా నష్టం జరిగిందా అనేది పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

టవర్ పరిసరాలు పూర్తి పిచ్చి మొక్కలు, చెట్లు పెరిగి ఉండటంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు చుట్టపు చూపుగా వచ్చి తాత్కాలిక పనులు చేస్తూ చేతులు దులుపుకోవడం వలన సంఘటన జరిగినట్లు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.కన్నాయిగూడెం మండలం కేంద్రంలో బిఎస్ఎన్ఎల్ టవర్ ఒక్కటే మండల ప్రజలకు దిక్కు, ఇతర ఏ నెట్వర్క్ కూడా మండలంలో పనిచేయదు. ఏజెన్సీ ప్రాంతం అయినటువంటి కన్నాయిగూడెం మండలంలో అత్యవసర సమయంలో సమాచారం ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. ఈ ఒక్కటవరు లేకపోవడంతో మండల వ్యాప్తంగ బాహ్య ప్రపంచంతో సంబంధాలు నిలిచిపోయాయి తక్షణమే జిల్లా అధికారులు స్పందించి బిఎస్ఎన్ఎల్ టవర్ ను పునరుద్ధరణ చేసి సేవలు అందించాలని డిమాండ్ చేస్తున్నారు











జగన్నాధపురం వరసిద్ధి విఘ్నేశ్వరుడిని దర్శించుకున్న బి.ఆర్.ఎస్. పార్టీ జిల్లా నాయకులు సోయం వీరభద్రం

- **గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగ విఘ్నేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించినా జిల్లా భా.ర.స నాయకులు సోయం వీరభద్రం**
- **ముఖ్య అతిథి సోయం వీరభద్రం ని శాలువ తో సత్కారించిన సొసైటీ గణేష్ ఉత్సవ కమిటీ,గ్రామస్థులు**
- **దమ్మపేట మండల కేంద్రం లో వినాయక ఫంక్షన్ హాల్ నందు పాట్టా వారి ఓణీల వేడుక మరియు పంచల వేడుక కార్యక్రమం కి హాజరు అయ్యిన చిన్నారులను ఆశీర్వధిం చిన సోయం వీరభద్రం...**

అశ్వరావుపేట:సెప్టెంబర్ 27(డిడి 9 వార్త)

ములకలపల్లి (మండలం) జగన్నాధపురం(గ్రామం) లో వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులను బి.ఆర్.ఎస్. పార్టీ జిల్లా నాయకులు సోయం వీరభద్రం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు సోయం వీరభద్రంని శాలువాతో ఘనంగా సన్మానించారు.అనంతరం లింగాలపల్లి గ్రామానికి చెందినా పొట్టా రవికుమార్ నాగమణి దంపతుల కుమార్తె చి"చైత్రశ్రీసాయి" ఓణిల వేడుక వారి కుమారుడు "భువన్ కార్తీక్ సాయి" కి పంచల వేడుక దమ్మపేట మండలం కేంద్రం లో వినాయక ఫంక్షన్ హాల్ నందు జరిగే కార్యక్రమంలో పాల్గొని చిరంజీవులను ఆశీర్వధించిన జిల్లా బిఆర్ఎస్ పార్టీ నాయకులు సోయం వీరభద్రం.ఈ కార్యక్రమం అశ్వరావుపేట టిడిపి నియోజకవర్గఇన్చార్జ్ కట్రం.స్వామి ధోర మాజీ MPTC తోకల గోపయ్య,అంకంపాలెం సర్పంచ్ మోకళ్ళ గురుమూర్తి ,కర్ణాటి. రమేష్, చారి,సత్యం,వూకే బుల్లిబాబు, వాడే.వెంకటేష్,తాటి జగన్ (రమణ) ,సోయం బొడప్ప,వూకే రవి, మడకం శ్రీనురావు ,లోకేంద్ర,మిడియం. వెంగళరావు,సున్నం శ్రీనివాసరావు,పాయం సూర్యం,ఈసం. వెంకటేష్ మరియు యువకులు పాల్గొన్నారు.







శ్రీ గాయత్రీ బ్రాహ్మణ సేవా సమితికి నూతన కార్యవర్గం

- **అధ్యక్షుడిగా రుద్రభట్ల ప్రవీణ్ శర్మ, ప్రధాన కార్యదర్శిగా అత్తెన చంద్రశేఖర్ శర్మ ఏకగ్రీవ ఎన్నిక**

పెద్దపల్లి బ్యూరో, సెప్టెంబరు 27 (డీడీ9 వార్త):





శ్రీ గాయత్రీ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రశాంత్‌నగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సమితి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అధ్యక్షుడిగా రుద్రభట్ల ప్రవీణ్ శర్మ, ప్రధాన కార్యదర్శిగా అత్తెన చంద్రశేఖర్ శర్మ, ఉపాధ్యక్షుడిగా దెబ్బెట అశోక్ చార్య, కోశాధికారిగా కల్వచర్ల మురళి ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా అధ్యక్షుడు రుద్రభట్ల ప్రవీణ్ శర్మ మాట్లాడుతూ, బ్రాహ్మణుల సంక్షేమం, సమితి అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. సభ్యుల సహకారంతో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.ఎన్నికల అధికారులుగా తనుగుల ఆంజనేయ శర్మ, మోగు హరినాథ్ శర్మ వ్యవహరించారు. నూతన కార్యవర్గ సభ్యులకు సమితి సభ్యులు అభినందనలు తెలిపారు.





స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో లో వోల్టేజ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- **స్టేషన్ ఘనపూర్‌కు 8 కొత్త సబ్ స్టేషన్లు మంజూరు ....**
- **ఇప్పటికే 4 పూర్తి.. నిర్మాణ దశలో ఉన్న మరో 4 త్వరలోనే ప్రారంభం....**

జనగామ సెప్టెంబర్ 27(డిడి 9 వార్త)బ్యూరో

గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతూ, రైతాంగానికి నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.

రఘునాథపల్లి మండలం ఫతేషాపూర్ గ్రామంలో నూతనంగా రూ. 2.45 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభొత్సవానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సబ్ స్టేషన్ ను రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. సబ్ స్టేషన్ ఆవరణలో పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఆయన విద్యుత్ సరఫరాను లాంఛనంగా పునఃప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ... నియోజకవర్గంలో విద్యుత్ మౌలిక వసతులను పటిష్టం చేసేందుకు ప్రత్యేక శ్రద్ధతో నియోజకవర్గంలో పెద్ద ఎత్తున సబ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా విద్యుత్ లోవోల్టేజ్ సమస్యలను శాశ్వతంగా అధిగమించడానికి 8 కొత్త 33/11 కేవీ సబ్ స్టేషన్లను మంజూరు చేయించినట్లు వెల్లడించారు. వీటిలో ఫతేషాపూర్‌తో కలిపి 4 సబ్ స్టేషన్ల నిర్మాణం ఇప్పటికే పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని స్పష్టం చేశారు. మిగిలిన 4 సబ్ స్టేషన్ల నిర్మాణ పనులు కూడా చివరి దశలో ఉన్నాయని, వాటిని కూడా వేగంగా పూర్తి చేసి అతి త్వరలోనే ప్రజలకు అంకితం చేస్తామని హామీ ఇచ్చారు.

సబ్ స్టేషన్ల నిర్మాణంతో పంట పొలాలకు సాగునీరు అందించే మోటార్లు కాలిపోకుండా వోల్టేజ్ సమస్యలు లేకుండా పూర్తిస్థాయిలో నాణ్యమైన విద్యుత్ అందుతుందని చెప్పారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలపడమే తన ధ్యేయమని, మౌలిక వసతుల కల్పనకు నిరంతరం శ్రమిస్తున్నట్లు పేర్కొన్నారు.


ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, జనగామ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గాదె మహేందర్ రెడ్డి, సర్పంచ్ లు పోకల శ్రీనివాస్ అక్కెనపల్లి సుజాత, పయ్యావుల రవి ఇబ్రహీంపూర్ గ్రామ అధ్యక్షుడు మేడిపల్లి నరేష్,రఘునాథపల్లి మండల ప్రజాప్రతినిధులు, జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు వివిధ గ్రామాలు ప్రజలు,మహిళలు మరియు రైతులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రానే వచ్చె మినీ మేడారం..!

- ఫిబ్రవరి 17 నుంచి 20 వరకు నాలుగు రోజుల పాటు జాతర
- 17న సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలకు రాక
- 18న చిలకలగుట్ట నుంచి సమ్మక్క గద్దెకు రాక
- 19న భక్తుల మొక్కులు.. 20న వనప్రవేశం
- జాతర ఏర్పాట్లకు అధికారులు సిద్ధం కావాలని పూజారుల విజ్ఞప్తి









ఏటురునాగారంకైం/తాడ్వాయి డి డి 9 వార్త, సెప్టెంబర్ 27:

కోట్లాది మంది భక్తులకు కొంగుబంగారంగా నిలిచినములుగు జిల్లా లోని మేడారం సమ్మక్క-సారలమ్మ మినీ జాతర రానే వచ్చింది.మహాజాతర ముగిసి సుమారు ఎనిమిది నెలలు గడుస్తుండగా,మహాజాతరకు ఆరు నెలల ముందుగానే నిర్వహించే మినీ మేడారం జాతరకు పూజారుల సంఘం తేదీలను ఖరారు చేసింది. మాఘశుద్ధ పాడ్యమిని పురస్కరించుకుని నాలుగు రోజుల పాటు ఈ జాతరను వైభవంగా నిర్వహించనున్నారు.

ఖరారైన మినీ మేడారం తేదీలు..!

వచ్చే ఏడాది ఫిబ్రవరి 17 నుంచి 20వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు మినీ మేడారం జాతర నిర్వహించాలని పూజారులు నిర్ణయించారు. ఫిబ్రవరి 17న సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు దేవతలు గద్దెలకు రానున్నారు. ఫిబ్రవరి 18న చిలకలగుట్ట నుంచి సమ్మక్క గద్దెకు రానున్నారు. ఫిబ్రవరి 19న శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో మేడారం చేరుకుని అమ్మవార్లకు మొక్కులు సమర్పించుకోనున్నారు. ఫిబ్రవరి 20న దేవతలు తిరిగి వనప్రవేశం చేయడంతో మినీ జాతర ముగియనుంది.నాలుగు రోజుల పాటు జాతరలో పూజారులు, గ్రామస్థులు నిద్రాహారాలు మాని భక్తులకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.జాతర అనంతరం అందరూ కలిసి అడవిలో వనభోజనాలకు వెళ్లే సంప్రదాయం కూడా కొనసాగుతుందని పూజారులు తెలిపారు.

గద్దెల వెనుక పూజారుల సమావేశం..!

మేడారంలోని గద్దెల వెనుక పూజారుల సంఘం ప్రత్యేక సమావేశం నిర్వహించింది.సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జెగ్గారావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మినీ మేడారం జాతర నిర్వహణ, పూజా కార్యక్రమాలు,తేదీల ఖరారు తదితర అంశాలపై పూజారులు చర్చించారు. అనంతరం 2027 ఫిబ్రవరి మూడో వారంలో నాలుగు రోజుల పాటు మినీ జాతర నిర్వహించేందుకు ముహూర్తం ఖరారు చేశారు. తేదీలు ఖరారైన అనంతరం సంబంధిత ప్రతులను దేవస్థానం ఈవోకు అందజేసినట్లు పూజారులు తెలిపారు.ఈ సమావేశంలో పూజారులు కొక్కెర కృష్ణ, మునేందర్,కొక్కెర రమేష్, వసంతరావు,సమ్మయ్య (బొక్కెన్న), సిద్ధబోయిన స్వామి,సురేందర్, అభ్యుదయ సంఘం బోజారావు, జనార్దన్,వెంకటేశ్వర్లు,సారలమ్మ పూజారులు కాక సారయ్య, కాక అమృత,కాక కిరణ్,శ్యాం, పగిడిద్దరాజు పూజారులు, పెనక వంశస్థులు,గోవిందరాజు పూజారులు కాక వెంకటేశ్వర్లు,గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లకు అధికారులు సిద్ధం కావాలి..!

మినీ మేడారం జాతర తేదీలు ఖరారు కావడంతో భక్తుల రాక మరింత పెరిగే అవకాశం ఉందని పూజారులు తెలిపారు.ఇప్పటికే ప్రతిరోజూ సమ్మక్క-సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు దేవతలను దర్శించుకునేందుకు భక్తులు మేడారం తరలివస్తున్నారని పేర్కొన్నారు. మినీ జాతర తేదీలు అధికారికంగా ఖరారు కావడంతో భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నందున అధికారులు ముందస్తుగా ఏర్పాట్లపై దృష్టి సారించాలని పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జెగ్గారావు కోరారు.భక్తులకు తాగునీరు,పారిశుధ్యం,రహదారులు, పార్కింగ్,విద్యుత్,వైద్య సేవలు తదితర మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు ఇప్పటి నుంచే కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు.మినీ మేడారం జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు పూజారుల సంఘం సిద్ధమవుతున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం కూడా సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

విజయవంతంగా కొనసాగిన బీసీఆర్ ట్రస్ట్ మెడికల్ క్యాంప్

భద్రాచలం టౌన్, సెప్టెంబరు 27 (డీ డీ 9 వార్త)

భద్రాచలంలో బీసీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'నెల నెల వైద్యం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం భద్రాచలంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు.సీపీఎంసీనియర్ రాష్ట్రనాయకులు సోమయ్య, బత్తుల హైమావతి మాట్లాడుతూ పోరాటాలతో పాటు ప్రజలకు సేవ చేయడంలోనూ కమ్యూనిస్టులు ముందుంటారని అన్నారు. కరోనా సమయంలో బీసీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐసోలేషన్ సెంటర్ నిర్వహించి సేవలందించారని గుర్తుచేశారు. సీనియర్ వైద్యులు డాక్టర్ ఎం.వి.కోటిరెడ్డి మాట్లాడుతూ పేదలకు ఉపయోగపడే ఈ వైద్య శిబిరానికి అన్ని విధాలా సహకరిస్తామని తెలిపారు. శిబిరంలో డాక్టర్ పవన్ కుమార్ , డాక్టర్ నీరజారెడ్డి, డాక్టర్ తేజస్విని ఉచితంగా వైద్య సేవలు అందించారు. సీపీఎం నాయకులు డాక్టర్ మిడియం బాబురావు, బండారు రవికుమార్ , మచ్చ వెంకటేశ్వర్లు, అన్నవరపు కనకయ్య తదితరులు శిబిరాన్ని పరిశీలించి ఏర్పాట్లను అభినందించారు. చక్కెర, రక్తపోటు బాధితులకు రూ.100కే మందులు అందించడం పేదలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.



సమగ్ర శిక్ష సిఆర్పీలకు ట్రావెలింగ్ అలవెన్స్ మొబైల్ ఛార్జీలు చెల్లించాలి

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకి వినతి
- సానుకూలంగా స్పందించిన ఉప ముఖ్యమంత్రి భట్టి

బోనకల్,సెప్టెంబర్ 27, (డీడీ9 వార్త):

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ మరియు ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బోనకల్ మండలంలోని యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పరిశీలనకు విచ్చేసిన సందర్భంగా, ఎస్.టి.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు దేవరకొండ సైదులు సమక్షంలో సమగ్ర శిక్షా సిఆర్పీల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ మహబూబ్ పాషా వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎస్.టి.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు దేవరకొండ సైదులు స్వయంగా వారి సమస్యలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లి,ప్రిన్సిపల్ సెక్రటరీ వద్ద పరిశీలనలో ఉన్న ట్రావెలింగ్ అలవెన్స్ మరియు మొబైల్ బిల్ ఫైల్ ను ఆమోదం తెలిపి దసరా కానుకగా వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు,దీనికి సానుకూలంగా స్పందించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెంటనే విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి లెటర్ ను ఎండార్స్ చేయాలని తన పర్సనల్ సహాయకునికి ఆదేశించారు.

అనంతరం సిఆర్పీల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ మహబూబ్ పాషా, తమ సమస్యలపై చొరవ తీసుకుని డిప్యూటీ సీఎంకి వివరించిన ఎస్.టి.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు దేవరకొండ సైదులుకి, మరియు సానుకూలంగా స్పందించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకి రాష్ట్ర సంఘం పక్షాన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.



ములుగు జిల్లాలో ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ (DAJGUA) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

తాడ్వాయి డిడి9 వార్త

వనవాసి కళ్యాణ పరిషత్ దేశంలోని 5 కోట్ల గిరిజన ప్రజల అభివృద్ధి కోసం దేశ ప్రధాని నరేంద్ర మోడీ గిరిజన ధర్తీ ఆబా భగవాన్ బిర్సా ముండా స్ఫూర్తితో ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకాన్ని 2024 అక్టోబర్ 2న ప్రారంభించడం జరిగిందని వనవాసి కళ్యాణ పరిషత్ ములుగు జిల్లా కార్యదర్శి డా. సంతోష్ కుమార్ మైపతి తెలిపారు.

ఈ పథకం ద్వారా ములుగు జిల్లాలో సుమారు 40 గిరిజన గ్రామాలు లబ్ధి పొందే అవకాశం ఉందని ఆయన అన్నారు. ప్రతి గ్రామంలో పెసా (PESA) గ్రామసభ తీర్మానం ద్వారా లబ్ధిదారులను గుర్తించడం జరుగుతుందన్నారు.

ఈ పథకంలోని ముఖ్యమైన అంశాలు:

ఈ పథకం మొత్తం రూ. 79,156 కోట్ల భారీ నిధులతో, 30 రాష్ట్రాల్లోని 63,843 గిరిజన గ్రామాల్లో 5 సంవత్సరాల పాటు (20242029) అమలు చేయబడుతుంది. ఇందులో 17 కేంద్ర మంత్రిత్వ శాఖల ద్వారా 25 రకాల అభివృద్ధి కార్యక్రమాలు అమలు అవుతాయి. 595

1. ఇళ్ళ నిర్మాణం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద 20 లక్షల పక్కా ఇళ్ళు.
2. రోడ్ల నిర్మాణం PMGSY కింద 25,000 కి.మీ. రోడ్లు.
3. తాగునీరు జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి గిరిజన ఇంటికి కుళాయి నీరు.
4. విద్యుత్ & సోలార్ 2.35 లక్షల ఇళ్ళకు విద్యుత్ కనెక్షన్, సోలార్ పవర్.
5. వైద్యం 1000 మొబైల్ మెడికల్ యూనిట్లు, ఆయుష్మాన్ భారత్ కార్డులు.
6. విద్య 1000 హాస్టళ్ళ నిర్మాణం, 40 ఏకలవ్య మోడల్ స్కూళ్ల అభివృద్ధి.
7. అంగన్వాడీ 8000 సక్షమ్ అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధి.
8. ఉపాధి వ్యవసాయం అటవీ హక్కు పత్రాలు పొందిన 2 లక్షల మంది రైతులకు స్థిరమైన వ్యవసాయ శిక్షణ, మత్స్య, పశుపోషణ పథకాలు.
9. హోమ్ స్టే మార్కెటింగ్ గిరిజనుల ఇళ్ళను హోమ్ స్టేలుగా మార్చడానికి ఒక్కొక్కరికి రూ. 5 లక్షలు, గిరిజన ఉత్పత్తుల అమ్మకానికి 100 మార్కెటింగ్ కేంద్రాలు. 59585

ఈ పథకం ద్వారా ములుగు జిల్లా గిరిజన ప్రతి కుటుంబం ఆధార్, కుల ధ్రువీకరణ, రేషన్ కార్డు, జన్ ధన్ ఖాతా, పెన్షన్లు, సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణ వంటి అన్ని పథకాలు ఒకే చోట పొందవచ్చు.

కావున జిల్లాలోని ప్రతి గూడెం ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పెసా గ్రామసభల్లో తీర్మానాలు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ అద్భుత పథకాన్ని అందించిన ప్రధాని మోడీకి ములుగు జిల్లా గిరిజనుల పక్షాన ధన్యవాదాలు తెలిపారు





మొదటి ప్రమాద హెచ్చరికకు చేరిన గోదావరి

భద్రాచలం టౌన్, సెప్టెంబరు 27 (డీ డీ 9 వార్త)

భద్రాచలం వద్ద గోదావరి ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక 43 అడుగులకు చేరుకుంది. అనంతరం మరో అడుగు మాత్రమే చేరి నిలకడగా ఉంది. ఎగువ ప్రాంతంలో వర్షాలు తగ్గడంతో మహారాష్ట్ర, చత్తీస్గడ్లో వర్షాలు లేకపోవడంతో గోదావరి వరద రాత్రి నుంచి క్రమేపి తగ్గుముఖం పట్టనుంది. శనివారం అర్ధరాత్రి 12 గంటలకు 35.80 అడుగులున్న గోదావరి తెల్లవారుజామున 4 గంటలకు 38.70 అడుగులు, ఆదివారం ఉదయం 7 గంటలకు 40.40 అడుగులు, మధ్యాహ్నం 11 గంటలకు 41.50, సాయంత్రం 4 గంటలకు 42.9 అడులకు అనంతరం 5.30 గంటలకు 43 అడుగులకు చేరింది. దీంతో 43 అడుగుల మొదటి ప్రమాద హెచ్చరికకు చేరడంతో భద్రాచలం సబ్కలెక్టర్ మృణాల్శ్రేష్ట మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు 43.1 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం గోదావరి నిలకడగా ఉంది.



ఓట్ల చోరీ వ్యవహారం, SIRపై కేంద్ర ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ సెప్టెంబర్ 28న భారీ నిరసన

- జనగామ జిల్లా కేంద్రంలో నెహ్రూ పార్క్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ

జనగామ సెప్టెంబర్ 27(డిడి 9) వార్త

జనగామ: ఓట్ల చోరీ వ్యవహారం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) పై కేంద్ర ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు సెప్టెంబర్ 28న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీ నారాయణ గారు తెలిపారు.

జనగామ జిల్లాలో సెప్టెంబర్ 28న ఉదయం 10 గంటలకు నెహ్రూ పార్క్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ గారికి వినతిపత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీ నారాయణ గారు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ అగ్రనేత, లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గారు "వోట్ చోరీ" అంశాన్ని ప్రజల ముందుకు తీసుకువచ్చి, ఓటర్ల జాబితాల్లోని అవకతవకలపై ప్రశ్నిస్తూ నిరంతరం పోరాడుతున్నారని తెలిపారు.

ప్రధాన డిమాండ్లు:* కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి.

* SIR ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలి.

* అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడాలి.

*ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపు, చేర్పులకు సంబంధించిన వివరాలను పారదర్శకంగా వెల్లడించాలి.

*ఓటర్ల జాబితాపై వచ్చిన అభ్యంతరాలు, ఫిర్యాదులను సమగ్రంగా పరిశీలించి పరిష్కరించాలి.వైటీడీఏ మెంబర్ డాక్టర్ లక్ష్మీ నారాయణ నాయక్ గారు మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన వ్యవహారాలపై కాంగ్రెస్ పార్టీ ప్రజల తరపున ప్రశ్నిస్తోందని అన్నారు. ఓటు హక్కు పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల కోసం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీ నారాయణ గారి ఆధ్వర్యంలో, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గారు, ఎంపీ కడియం కావ్య గారు, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి గారు, జనగామ నియోజకవర్గ ఇన్చార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి గారు, హనుమాండ్ల ఝాన్సీరెడ్డి గారి నాయకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు భారీ సంఖ్యలో తరలివచ్చి ర్యాలీ, ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్ మీట్లో డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీ నారాయణ గారు, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ మారుజోడు రాంబాబు గారు, వైటీడీఏ మెంబర్ డాక్టర్ లక్ష్మీ నారాయణ నాయక్ గారు మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు లోకుంట్ల ప్రవీణ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బోనాసి క్రాంతి, సేవాదళ్ అధ్యక్షుడు జాయ మల్లేష్,లింగాల ఘనపూర్ మండల అధ్యక్షుడు గాదె మహేందర్ రెడ్డి, చింతకింది మల్లేష్, మండల ప్రధాన కార్యదర్శి లోనే శ్రవణ్ బాబు, సర్పంచ్ పోకల శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు మేడిపల్లి మహేష్, డీసీసీ ఈసీ మెంబర్ కోట నాయక్, జనగామ పట్టణ నాయకులు మోతె జనార్దన్, మచ్చ ప్రవీణ్, మూడవ వార్డు అధ్యక్షుడు గుంటుక దామోదర్ రెడ్డి, బాల్దే శ్రీశైలం, మారబోయిన నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



కార్మికుల కోసం పోరుబాట

- బీజేపీ లేబర్ సెల్‌కు నూతన సారథులు.. జిల్లా కో-కన్వీనర్‌గా ఎల్తురి రాజయ్య సహా మండల కన్వీనర్ల నియామకం


పెద్దపల్లి బ్యూరో, సెప్టెంబరు 27 (డీడీ9 వార్త):

కార్మికుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడటమే బీజేపీ లేబర్ సెల్ ప్రధాన లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు. బీజేపీ లేబర్ సెల్ రాష్ట్ర కన్వీనర్ అందె శ్రీనివాస్, బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కర్రె సంజీవరెడ్డి సూచనల మేరకు పెద్దపల్లి జిల్లా లేబర్ సెల్ నూతన కమిటీతో పాటు వివిధ మండలాల కన్వీనర్ల నియామకాలు చేపట్టారు.

రామగుండం నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి, రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమానికి బీజేపీ లేబర్ సెల్ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ తడగొండ నర్సయ్య అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా బీజేపీ లేబర్ సెల్ పెద్దపల్లి జిల్లా కోకన్వీనర్‌గా ఎల్తురి రాజయ్య నియమితులయ్యారు. అలాగే వివిధ మండలాల కన్వీనర్లుగా జనగామ మండల్ - బియ్యాల మహేందర్, లక్ష్మీ నగర్ మండల్ - వీరబోయిన శ్రీనివాస్ యాదవ్, తిలక్‌నగర్ మండల్ - జక్కుల ప్రవీణ్, కోకన్వీనర్‌గా సుమలత, ఎన్‌టీపీసీ - ఎరుకొండ తిరుపతి, 8వ కాలనీ మండల్ - కంచర్ల రాజేశం, పాలకుర్తి మండల్ - బైరి తిరుపతి గౌడ్, అంతర్గాం మండల్ - గోలివాడ శ్రీనివాస్లను నియమించారు.

నూతనంగా నియమితులైన వారికి కందుల సంధ్యారాణి, తడగొండ నర్సయ్య నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతలు స్వీకరించిన నాయకులు మాట్లాడుతూ.... పార్టీ నాయకత్వం తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తామని తెలిపారు. కార్మికుల సమస్యలను తెలుసుకుని, వారి హక్కుల పరిరక్షణ కోసం జరిగే పోరాటాల్లో ముందుండి పనిచేస్తామని, కార్మికులకు న్యాయం జరిగేలా తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.





దోపిడీ రహిత సమాజ నిర్మాణమే కమ్యూనిస్ట్ కర్తవ్యం

- **శిక్షణ తరగతుల్లో పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు**

బోనకల్,సెప్టెంబర్ 27, (డీడీ9 వార్త):

దోపిడీ, అణచివేత, పీడన, ప్రకృతి విధ్వంసం లేని వర్గరహిత సమాజం నిర్మించడమే కమ్యూనిస్ట్ కర్తవ్యమని పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు తెలిపారు. ఆదివారం బోనకల్ సిపిఎం కార్యాలయంలో స్టడీ సర్కిల్ కన్వీనర్ తెల్లాకుల శ్రీనివాసరావు అధ్యక్షతన మంచి కమ్యూనిస్ట్ ఎలా ఉండాలి? అనే అంశంపై పల్లా కొండలరావు ఉపన్యసించారు. సమాజంలో మార్పు అనివార్యంగా ఉంటుందని తెలిపారు. మనిషి తన మనుగడ కోసం ప్రకృతిపై పోరాటం చేస్తాడన్నారు. ఈ సందర్భంగా చారిత్రక పరిణామ క్రమంలో నిర్దిష్ట దశలో మానవ సంబంధాల్లో వర్గాలు ఏర్పడి వర్గపోరాటాలు జరుగుతున్నాయన్నారు. ఉత్పత్తి క్రమంలో దోపిడీ జరగడానికి ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యం ఎవరిది అనేది కీలకమైన అంశం అన్నారు. ఉత్పత్తి సాధనాలపై సమిష్టి హక్కు ఉంటే ప్రణాళికా బద్ధమైన సంపద సృష్టి, పంపిణీలో అసమానతలు లేకుండా అందరికీ పని అందరికీ విశ్రాంతి సాధ్యమేనన్నారు. ఇది సాధ్యం చేయాలంటే సుదీర్ఘ వర్గపోరాటానికి నాయకత్వం వహించే కమ్యూనిస్ట్ లు స్వయం సాధనతో మేధోశ్రమతో కమ్యూనిస్ట్ సిద్ధాంతాన్ని ఆకళింపు చేసుకుని దానిని మెళకువగా కార్యాచరణలో అన్వేషించాలని తెలిపారు. అన్యవర్గ ధోరణులు వదిలించుకోవడానికి కమ్యూనిస్ట్ సిగ్గు పడాల్సిన పని లేదని అది నిత్య కర్తవ్యంగా పెట్టుకుని తాను మారుతూ ప్రజల్లో మార్పు కోసం నిరంతరం కృషి చేయాలని కోరారు. మనం మారగలం మనమే మార్చగలం అన్నది నమ్మకం కలగాలంటే మార్క్సిస్టు శాస్త్రీయ సిద్ధాంతాన్ని సంపూర్ణంగా అవగాహన చేసుకోవాలన్నారు. బూర్జువా విప్లవంలో విజయోన్మాదం తలకెక్కడం దోపిడీ కొత్త రూపంలో కొనసాగడం చూస్తుంటామని ఆ ధోరణులు చొరబడకుండా కమ్యూనిస్ట్ విప్లవం జయప్రదం అయిన తర్వాత కూడా సమిష్టికృషి జరగాలన్నారు. వర్గపోరాటం, కమ్యూనిస్ట్ ప్రణాళిక, నిర్మాణంలపై సైద్ధాంతిక అవగాహన పెంచుకుని స్వయం సాధనతో రాటుదేలడమే మంచి కమ్యూనిస్ట్ లక్షణం అన్నారు. నిరంతర పోరాటంలో వ్యక్తిగత జీవితంలో, విప్లవోద్యమ భాగ స్వామ్యంలో ఆచరణ ఆధారంగా తనను తాను మెరుగుపరచుకోవాలన్నారు. ఈ స్టడీ సర్కిల్ లో దొండపాటి నాగేశ్వరావు, కిలారు సురేష్, బంధం శ్రీనివాసరావు, జొన్నలగడ్డ సునీత, కూచిపూడి మురళి, దొండపాటి సత్యనారాయణ, కంసాని సూర్యప్రకాష్ రావు, గద్దె రామారావు, కొమ్మినేని సీతారాములు, రచ్చ శివ, చామర్తి వెంకటేశ్వర్లు, పొన్నం రామకృష్ణ, పొన్నం ఉపేందర్, కొండేటి అప్పారావు, ఏసుపోగు బాబు తదితరులు పాల్గొన్నారు.

గుండాల మండల సమస్యలను పరిష్కరించాలి

- **ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నియామకం, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని పీవైఎల్ డిమాండ్**

గుండాల, సెప్టెంబర్ 27 (డిడి9 వార్త):

గుండాల మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) డిమాండ్ చేసింది. ఆదివారం నడిమిగూడెం గ్రామంలో పీవైఎల్ గ్రామ కమిటీ సమావేశం ఊకే శ్రావణ్ అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సందర్భంగా మాస్‌లైన్ పార్టీ డివిజన్ కార్యదర్శి ఈసం శంకర్, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు పూనేం మంగయ్య మాట్లాడుతూ గుండాల ప్రభుత్వ ఆసుపత్రిలో గత రెండు నెలలుగా వైద్యులు అందుబాటులో లేరని పేర్కొన్నారు. దీంతో మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు వైద్యం కోసం ఇల్లెందు, కొత్తగూడెం తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. అలాగే ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గ్రామాల్లో మురుగునీరు నిలిచిపోవడంతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, దోమల నివారణకు ఫాగింగ్ వంటి చర్యలు చేపట్టాలని కోరారు. జ్వరాలు, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నివారణకు అధికారులు ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

మండలంలోని కొన్ని గ్రామాల్లో బెల్ట్‌షాపుల పేరుతో అక్రమంగా గుడుంబా, నాటుసారా, మత్తు పదార్థాలు విక్రయిస్తున్నారన్న ఫిర్యాదులపై ఎక్సైజ్, పోలీసు శాఖలు తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

గుండాల ప్రభుత్వ ఆసుపత్రికి ఇద్దరు శాశ్వత వైద్యులను వెంటనే నియమించి, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని, అన్ని గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి బ్లీచింగ్, దోమల మందు పిచికారీ చేయాలని పీవైఎల్ నాయకులు డిమాండ్ చేశారు. అక్రమ మద్యం, మత్తు పదార్థాల విక్రయాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజా సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించకపోతే పీవైఎల్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని నాయకులు తెలిపారు. సమావేశంలో పూనేం సుధాకర్, జబ్బ గణేష్, పూనేం సతీష్, పూనేం మహేష్, దానసరి సారయ్య, దశందర్రావు, పూనేం భరత్, జబ్బ నవీన్, జబ్బ సురేష్, జబ్బ సుమన్, జబ్బ కేశవరావు తదితరులు పాల్గొన్నారు.



ఇచ్చోడ మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ అజీమ్

DD9 వార్తలు సెప్టెంబర్ 27 అదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం

తొలిప్రభ ఆదిలాబాద్ బ్యూరో:ఇచ్చోడ మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా సీరిచేల్మ ఉప సర్పంచ్ అబ్దుల్ అజీమ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరేష్ జాదవ్ చేతుల మీదుగా అబ్దుల్ అజీమ్ నియామక పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా అబ్దుల్ అజీమ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో ఇచ్చోడ మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో మండల ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన జిల్లా పార్టీ అధ్యక్షులు నరేష్ జాదవ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలకు మెరుగైన విద్యుత్ కోసమే లైన్ల మరమ్మతులు..!

- **మండల వ్యాప్తంగా కొనసాగుతున్న పనులు**
- **పాత తీగలు, స్తంభాల తొలగింపు.. కొత్త వాటి ఏర్పాటు**
- **గాలిదుమారాలు వచ్చినా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు**
- **బ్రేక్ డౌన్ టీమ్ పల్నాటి నరేష్ ,రాజు ఆధ్వర్యంలో**
- **అధికారుల ఆదేశాలతో లైన్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణ**

ఏటూరునాగారం క్రైం,
డి డి 9 వార్త, సెప్టెంబర్ 27







ప్రజలకు నిరంతరాయంగా మెరుగైన విద్యుత్ సరఫరా అందించాలనే లక్ష్యంతో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో లైన్ల మరమ్మతు పనులు చేపడుతున్నారు.ములుగు జిల్లా తాడ్వాయి మండల వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్లను పరిశీలిస్తూ పాత తీగలు, దెబ్బతిన్న స్తంభాలు,ఇతర సామగ్రిని తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేస్తున్నారు. గాలిదుమారాలు, వర్షాలు వచ్చిన సమయంలో విద్యుత్ లైన్లకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ పనులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

కాటాపురం రామాలయ వీధిలో పనులు...!!.

మండలంలోని కాటాపురం గ్రామంలోని రామాలయ వీధిలో విద్యుత్ లైన్ల మరమ్మతు పనులను చేపట్టారు. పాతబడిన విద్యుత్ తీగలను తొలగించి వాటి స్థానంలో కొత్త తీగలను ఏర్పాటు చేయడంతో పాటు అవసర మైన చోట్ల స్తంభాలు, ఇతర విద్యుత్ సామగ్రిని అమర్చుతున్నారు.శనివారం రామాలయ వీధిలో చేపట్టిన పనులు పూర్తయినట్లు సిబ్బంది తెలిపారు. మండలంలో రోజుకో వార్డును ఎంపిక చేసుకుని దశలవారీగా పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.లైన్లను పటిష్టం చేయడం ద్వారా గాలి దుమారం వచ్చినా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. పనులు పూర్తయిన అనంతరం విద్యుత్ లైన్లు మరింత పటిష్టంగా ఉండి బ్రేక్‌డౌన్ల సమస్య తగ్గే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

అధికారుల పర్యవేక్షణలో పనులు...!!

పై అధికారుల ఆదేశాల మేరకు మండల లైన్ ఇన్‌స్పెక్టర్ ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తున్నారు. లైన్ల మరమ్మతులు నాణ్యతగా జరుగుతున్నాయా, అవసరమైన ప్రాంతాల్లోనే పాత సామగ్రిని తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేస్తున్నారా అనే అంశాలను పరిశీలిస్తున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను వేగంగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచిస్తున్నారు.

బ్రేక్‌డౌన్ టీమ్ సేవలు...!!

విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల్లో బ్రేక్‌డౌన్ టీమ్ సభ్యులు పల్నాటి నరేష్ కుమార్, దేవరకొండ రాజు, గుండ్ల సురేష్ తదితరులు కీలకంగా సేవలందిస్తున్నారు. పనులు పూర్తయ్యే వరకు సిబ్బందితో కలిసి ఉంటూ అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తున్నారు. ఎక్కడైనా సాంకేతిక సమస్య తలెత్తితే వెంటనే స్పందిస్తూ పనులు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకుంటున్నారు. కాటాపురంలో వార్డుల వారీగా చేపడుతున్న విద్యుత్ లైన్ల పనులను బ్రేక్‌డౌన్ టీమ్ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారు.అధికారుల ఆదేశాలను తు.చ.తప్పకుండా పాటిస్తూ,ప్రజలకు చేదోడువాదోడుగా ఉంటూ విద్యుత్ సేవలు అందిస్తున్న సిబ్బందిని గ్రామస్తులు, మహిళలు, యువకులు, ప్రజాప్రతినిధులు అభినందిస్తున్నారు.



జర్నలిస్ట్ సత్యానందం కుటుంబానికి బోనకల్ ప్రెస్ క్లబ్ చేయూత

- **రూ.60 వేల ఆర్థిక సహాయం అందజేత**
- **భవిష్యత్తులోనూ తమ వంతు సహకారం అందిస్తాం:గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్ రాథోడ్**
- **సత్యానందం కుటుంబానికి అన్ని వేళలా అండగా ఉంటాం: ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు డేగల వేలాద్రి**

బోనకల్,సెప్టెంబర్ 27,(డీడీ9 వార్త):

బోనకల్ ప్రెస్ క్లబ్ సభ్యుడు,విజన్ ఆంధ్రా దిన పత్రిక విలేకరి,మందా సత్యానందం ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం జరిగింది ,వారి కుటుంబానికి అండగా నిలుస్తూ స్థానిక ప్రెస్ క్లబ్ సభ్యులు కలిసి రూ.60 వేల ఆర్థిక సహాయాన్ని సత్యానందం సతీమణి కి అందజేశారు.తోటి జర్నలిస్టు కుటుంబం ఆపదలో ఉందని తెలిసి బోనకల్ ప్రెస్ క్లబ్ సభ్యులు మానవత్వంతో ముందుకొచ్చి ఆర్థిక సహాయాన్ని అందజేసి తమ సహృదయాన్ని చాటుకున్నారు. తమ మిత్రుడు సత్యానందం అకాల మరణం చెందడం తీవ్రంగా బాధించిందని,కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలవడం కంటే గొప్ప సహాయం మరొకటి లేదనే భావనతో జర్నలిస్టులంతా కలిసి ఈ సహాయాన్ని అందించి సత్యానందం కుటుంబానికి భవిష్యత్తులోనూ తమ వంతు సహకారం అందిస్తామని గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్ రాథోడ్ తెలిపారు.

ఈసందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడుదేగల వేలాద్రి మాట్లాడుతూ సత్యానందం మృతి ప్రెస్ క్లబ్‌కు, జర్నలిస్టు కుటుంబానికి తీరని లోటని అన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోయిన సత్యానందం కుటుంబం ఆపదలో ఉన్న సమయంలో తోటి జర్నలిస్టులుగా అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారూ.సత్యానందం కుటుంబం ఒంటరిగా లేదని,తోటి జర్నలిస్టులంతా కుటుంబ సభ్యుల్లా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఆపదలో ఉన్న కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడమే కాకుండా మానవత్వమే ముందుగా.. జర్నలిస్టుల ఐకమత్యే బలంగా నిలవాలనేసందేశాన్నిబోనకల్ ప్రెస్‌క్లబ్ చాటిచెప్పింది. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు బాజీ షరీఫ్, యంగల గౌతం,షేక్ బడే,మాగి ముఖేష్,పెంటు సాహెబ్,నాగటి రాజశేఖర్,తగరం రమేష్,కొణతాలపల్లి నాగేశ్వరరావు,తెల్లబోయిన సుమన్,గ్రామ సర్పంచ్ మందా కరుణ,కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.



బాబు వైద్యానికి మరో రూ.45 వేల ఆర్థిక చేయూత అందజేత

భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 27 (డీ డీ 9 వార్త)

భద్రాచలంలో ఆదర్శనగర్ కాలనీకి చెందిన రోహిత్ అనే 12 ఏళ్ల బాలుడి అత్యవసర వైద్యానికి మన సమాచారం గ్రూప్ సభ్యులందరూ కలిసి రూ.45 వేల ఆర్థిక సహాయంను బాలుడి వైద్య ఖర్చుల కోసం గ్రూప్ సభ్యుల సహకారంతో ఈ మొత్తాన్ని బాలుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. అత్యవసర సమయంలో స్పందించి బాలుడి కుటుంబానికి అండగా నిలిచిన మన సమాచారం గ్రూప్ సభ్యులు, ఆపదలో ఉన్న కుటుంబానికి తమవంతు సహాయం అందించడం ద్వారా మానవత్వం చాటుకున్నారని కొనియాడారు.



ఐటీడీఏ గిరిజన దర్బార్ , ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

భద్రాచలం టౌన్, సెప్టెంబరు 27 (డీ డీ 9 వార్త)

భద్రాచలం ఐటీడీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్ ,ప్రజావాణి కార్యక్రమాలకు అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ , సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. గిరిజనులు, ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను లిఖితపూర్వకంగా అందజేయాలని అధికారులు సూచించారు. వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందేందుకు గిరిజన దర్బార్ , ప్రజావాణి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గిరిజన దర్బార్ , సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐటీడీఏ పరిధిలోని అన్ని యూనిట్ అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు తప్పనిసరిగా సమయానికి హాజరై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.



వారం రోజులుగా నిరంతరాయంగా గణేష్ నిమజ్జనాలు

- **భారీ విగ్రహాలతో నెమ్మదించిన ప్రక్రియ.. మరో రెండు రోజులు పట్టే అవకాశం**

భద్రాచలం టౌన్, సెప్టెంబరు 27 (డీ డీ 9 వార్త)

భద్రాచలంలోని గోదావరి నదిలో గణేష్ నిమజ్జనాల ప్రక్రియ వారం రోజులుగా నిరంతరాయంగా కొనసాగుతోంది. వినాయక చవితి సందర్భంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ప్రతిష్ఠించిన గణనాథులను భక్తులు భారీ సంఖ్యలో భద్రాచలానికి తరలిస్తుండటంతో నిమజ్జనాల ప్రక్రియకు మరింత సమయం పడుతోంది. ఇప్పటికే పెద్ద సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనం కాగా, ఇంకా పలు ప్రాంతాల నుంచి గణనాథులు భద్రాచలానికి చేరుకుంటున్నారు. పెద్ద విగ్రహాల సంఖ్య అధికంగా ఉండటంతో వాటిని నేరుగా గోదావరిలోకి తరలించడం సాధ్యం కాకపోవడంతో నది ఒడ్డున కొంతసేపు ఉంచి, వంతుల వారీగా నిమజ్జనం చేస్తున్నారు. భారీ విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు లాంచీని వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఒకే లాంచీ అందుబాటులో ఉండటంతో నిమజ్జనాల ప్రక్రియ కొంత నెమ్మదిగా సాగుతోంది. మరోవైపు విగ్రహాల సంఖ్యకు అనుగుణంగా సిబ్బంది తక్కువగా ఉండటంతో అధికారులు అందుబాటులో ఉన్న వనరులతోనే నిమజ్జనాలను నిర్వహిస్తున్నారు. విగ్రహాల తరలింపు, నిమజ్జనం, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారు. గోదావరి పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి గణనాథుల రాక ఇంకా కొనసాగుతుండటంతో నిమజ్జనాల ప్రక్రియ పూర్తవడానికి మరో రెండు రోజుల సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో భద్రాచలంలోని గోదావరి తీరం మరో రెండు రోజుల పాటు గణేష్ నిమజ్జనాలతో సందడిగా ఉండనుంది.



తుపాకీ వదిలి.. పెన్ను పట్టిన అన్నలు..!

- ఆయుధం స్థానంలో అక్షరం.. అడవుల నుంచి పరీక్షా కేంద్రాలకు!
- ఛత్తీస్‌గఢ్‌లో ఓపెన్ స్కూల్ కేంద్రం.. పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు మావోయిస్టు కేడర్ హాజరు
- ఒడిశాకు చెందిన యువ కమాండర్‌కు మంచి మార్కులు.. మరో పది మంది పరీక్షలకు సిద్ధం
- మావోయిస్టు కేంద్ర కమిటీ నేత దేవ్‌జీ సైతం ఇంటర్ పరీక్షలు రాసినట్లు సమాచారం

ఏటూరునాగారం క్రైం, డి డి 9 వార్త, సెప్టెంబర్ 26:





అడవుల్లో తుపాకులతో సంచరించిన చేతులు.. ఇప్పుడు పెన్నులు పట్టాయి. ఏళ్లుగా ఆయుధ పోరాటంలో ఉన్నవారు అక్షరాల వైపు అడుగులు వేస్తున్నారనే సమాచారం ఆసక్తి రేపుతోంది.తుపాకీ స్థానంలో పెన్ను పట్టి పరీక్షలు రాస్తూ విద్యను కొనసాగించేందుకు ముందుకు వస్తున్నారని విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం.

అన్నలకు విద్యాబాట.. ఓపెన్ స్కూల్ కేంద్రం ఏర్పాటు

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని యువతకు విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఈ కేంద్రాల్లో ఛత్తీస్‌గఢ్‌తో పాటు ఒడిశా, నేషనల్ పార్క్, మారేడుమిల్లి, జార్ఖండ్ ప్రాంతాల్లో పనిచేస్తున్న కేడర్‌లో కొందరు పరీక్షలకు హాజరైనట్లు తెలుస్తోంది.

తుపాకీకి బదులు.. పెన్నుతో పోరాటం!

ఇప్పటివరకు అడవుల్లో ఆయుధాలతో ఉన్న కొందరు యువకులు విద్యను కొనసాగించేందుకు పరీక్షలు రాయడం ప్రాధాన్యత సంతరించుకుంది. పదో తరగతి పరీక్షలకు హాజరైన వారిలో ఒడిశాకు చెందిన ఓ యువ కమాండర్ మంచి మార్కులు సాధించినట్లు సమాచారం. పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అక్కడి పాఠశాల ప్రిన్సిపాల్ అభినందించినట్లు తెలుస్తోంది.

మరో పది మంది.. పదో తరగతి, ఇంటర్ వైపు

ఇదే క్రమంలో మరో పది మంది వరకు డీసీఎం స్థాయి కేడర్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలు రాసేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఆయుధాలు పక్కనపెట్టి విద్య వైపు అడుగులు వేస్తున్న ఈ పరిణామం మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో చర్చనీయాంశంగా మారింది.

దేవ్‌జీ సైతం ఇంటర్ పరీక్షలు రాసినట్లు సమాచారం....

మావోయిస్టు కేంద్ర కమిటీకి చెందిన దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతి సైతం ఇంటర్ పరీక్షలు రాసినట్లు సమాచారం.ఆయన అన్ని పేపర్లకు హాజరై పరీక్షలు రాసినట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొంటున్నాయి.ఈ విషయం





బయటకు రావడంతో పరీక్షా కేంద్రంలోని ప్రిన్సిపాల్‌తో పాటు అక్కడ పరీక్షలకు హాజరైన యువకులు దేవ్‌జీని అభినందించినట్లు సమాచారం.

అక్షరాల వైపు అడుగులు.. భవిష్యత్తుపై ఆశలు!

అడవుల్లో ఆయుధాలతో తిరిగిన యువత విద్య వైపు మళ్లడం చర్చనీయాంశంగా మారింది. విద్య ద్వారా తమ భవిష్యత్తును మార్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో చోటుచేసుకున్న ఈ పరిణామంపై తెలంగాణతో పాటు ఉమ్మడి వరంగల్, ములుగు జిల్లాల్లోనూ చర్చ జరుగుతున్నట్లు సమాచారం.

ప్రజల ముందుకు.. కొత్త మార్గంలో సాగుతారా?

ఆయుధ పోరాటం నుంచి విద్య వైపు అడుగులు వేస్తున్నారన్న వార్తలు నిజమైతే, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఇది ఒక కీలక పరిణామంగా నిలిచే అవకాశం ఉంది. తుపాకీకి బదులు పెన్ను పట్టి, విద్యను ఆయుధంగా మార్చుకుని సమాజంలోకి రావాలనే ఆలోచనకు ఇది సంకేతమా అనే చర్చ మొదలైంది. అయితే ఈ పరిణామాలపై అధికారికంగా పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది.

అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు సిద్ధం

- రేషన్ కార్డుల పంపిణీపైనా చర్చిద్దాం: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఊకె బుచ్చయ్య

గుండాల, సెప్టెంబర్ 27 (డిడి 9వార్త):

బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై విమర్శలు చేసే ముందు గుండాల మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను పరిశీలించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఊకె బుచ్చయ్య సూచించారు. గుండాల మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండలంలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు బుచ్చయ్య తెలిపారు. జగ్గుతండా-లక్ష్మీదేవిపల్లి బీటీ రోడ్డుకు రూ.2 కోట్లు, బాలికల పాఠశాల అదనపు భవనానికి రూ.1.50 కోట్లు, నాగారం బీటీ రోడ్డు నుంచి గ్రామానికి రహదారి నిర్మాణానికి రూ.60 లక్షలు కేటాయించినట్లు వివరించారు.

మండల కేంద్రంలోని రెవెన్యూ అధికారి భవన నిర్మాణానికి అదనంగా రూ.60 లక్షలు, చీమలగూడెం బీటీ రోడ్డు నుంచి ఇప్పలగుంపు వరకు బీటీ రోడ్డుకు రూ.కోటి మంజూరైనట్లు పేర్కొన్నారు. మూడు గ్రామ పంచాయతీల భవనాల నిర్మాణానికి ఒక్కో భవనానికి రూ.20 లక్షల చొప్పున నిధులు కేటాయించినట్లు తెలిపారు.

మండలవ్యాప్తంగా ఐదు చెక్‌డ్యామ్‌లకు సుమారు రూ.10 కోట్లు, గత మూడు సంవత్సరాల్లో 48 సీసీ రోడ్లకు రూ.2.64 కోట్లు కేటాయించినట్లు బుచ్చయ్య వెల్లడించారు. రంగాపురం-సాయనపల్లి మార్గంలో తాత్కాలిక మరమ్మతుల కోసం మూడు దఫాలుగా రూ.17 లక్షలతో గ్రావెల్ పనులు చేపట్టినట్లు తెలిపారు.

రేషన్ కార్డుల పంపిణీపై కూడా బీఆర్ఎస్ నాయకులతో బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని బుచ్చయ్య స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని ఆయన కోరారు.

సమావేశంలో గుండాల గ్రామపంచాయతీ అధ్యక్షుడు వాంకుడోత్ రమేష్, మండల నాయకుడు వాంకుడోత్ బీకోజీ, సర్పంచులు కల్తి కృష్ణారావు, భూక్య మంగమ్మతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శిల్పకళా వైభవంతో నూతన రామాలయం

- పంచరాత్రాగమ శాస్త్రానుసారం మూర్తుల రూపకల్పన
- ఆళ్వార్లు, భగవత్ మూర్తులు, అమ్మవార్ల శిల్పాల చెక్కడం ప్రారంభం
- ఉత్తరద్వారానికి ప్రత్యేక శిల్పకళా సొబగులు

భద్రాచలం టౌన్, సెప్టెంబరు 27 (డిడి 9 వార్త)







భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి శిల్పకళా వైభవాన్ని అద్దే పనులు ప్రారంభమయ్యాయి. పంచరాత్రాగమ శాస్త్రం, శ్రీవైష్ణవ సంప్రదాయాలకు అనుగుణంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న వివిధ దేవతామూర్తులు, ఆళ్వార్లు, భగవత్ మూర్తులు, అమ్మవార్ల శిల్పాలను నిపుణులైన శిల్పులు చెక్కుతున్నారు.

భక్త రామదాసు కాలంలో నిర్మితమైన ఆలయ పురాతన శిల్ప సంపదకు అనుగుణంగా, నూతన ఆలయ నిర్మాణానికి సరిపోయే విధంగా శిల్పాలను రూపొందిస్తున్నారు. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్‌లోని పురుషోత్తపట్నం గోకులరామం ప్రాంతం నుంచి ప్రత్యేకమైన శిలలను ఇప్పటికే భద్రాచలానికి తరలించారు. శిల్పులు అక్కడే ఉండి పనులు చేపట్టేలా అవసరమైన నివాస సదుపాయాలను సైతం ఏర్పాటు చేశారు.

ప్రభుత్వం, దేవస్థానం అందజేసిన ప్రత్యేక డిజైన్లు, నమూనాల ఆధారంగా శిల్పులు శిలలను మలుస్తున్నారు. భద్రాచలం రామాలయంలో పంచరాత్రాగమ శాస్త్ర సంప్రదాయానికి అనుగుణంగా నిత్యపూజా కార్యక్రమాలు కొనసాగుతున్న నేపథ్యంలో, అదే ఆగమ విధానం, శ్రీవైష్ణవ సంప్రదాయాలకు అనుగుణంగా నూతన ఆలయ శిల్పాలను రూపొందిస్తున్నారు.

ఆధ్యాత్మిక ప్రతీకలుగా శిల్పాలు

ఆళ్వార్లు, భగవత్ మూర్తులు, లక్ష్మీ అమ్మవారు, రాజ్యలక్ష్మీ అమ్మవారు, ఇతర అమ్మవార్లు, శంకర భగవత్పాదులు తదితర ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన మూర్తుల శిల్పాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆలయ గోడలు, స్తంభాలు, ద్వారాలు తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న శిల్పాలు భక్తులను ఆకట్టుకునే రీతిలో రూపొందుతున్నాయి.

ఉత్తరద్వారానికి ప్రత్యేక శోభ

నూతన రామాలయంలోని ఉత్తరద్వారాన్ని ప్రత్యేక శిల్పకళా వైభవానికి ప్రతీకగా తీర్చిదిద్దుతున్నారు. ద్వారానికి ఇరువైపులా ఏర్పాటు చేయనున్న శిల్పాలతో పాటు, పరిసర గోడలు, స్తంభాలపై రూపొందించే శిల్పాలు ఆలయానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఆలయ నిర్మాణం పూర్తయిన అనంతరం ఈ శిల్పాలు రామాలయ సౌందర్యాన్ని మరింత ఇనుమడింపజేయనున్నాయి.


భద్రాచలం రామాలయానికి ఉన్న చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని నూతన నిర్మాణాల్లోనూ సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తున్నారు. పురాతన ఆలయ వైభవాన్ని పరిరక్షిస్తూ, ఆధునిక అవసరాలకు అనుగుణంగా చేపడుతున్న నిర్మాణ పనుల్లో శిల్పకళకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. నూతన రామాలయం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాత ఆలయ శిల్పకళా వైభవం భక్తులకు మరింత ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించనుంది.

మామునూరు విమానాశ్రయానికి బాపూజీ పేరు పెట్టాలి

- బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించాలి
- తెలంగాణ కోసం మంత్రి పదవినే త్యాగం చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ
- పోపా అధ్యక్షులు డాక్టర్ రాజేశ్వర ప్రసాద్

పరకాల,సెప్టెంబర్ 27, డి డి 9వార్త

మూడు తరాల తెలంగాణ స్వాతంత్ర్య,విముక్తి పోరాటాల్లో ముందుండి ప్రజల హక్కుల కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడు,మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించి సముచిత గౌరవం కల్పించాలని పరకాల పోపా అధ్యక్షులు డాక్టర్ రాజేశ్వర ప్రసాద్ డిమాండ్ చేశారు.కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతిని పురస్కరించుకుని పరకాల పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షులు బాసని దయాకర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి డాక్టర్ రాజేశ్వర ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై పట్టణంలోని బస్సు డిపో జంక్షన్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మంత్రి పదవిని సైతం త్యాగం చేసిన బాపూజీ సేవలను ప్రభుత్వం గుర్తించాలని, మామునూరు విమానాశ్రయానికి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని ఆయన కోరారు.పదవులు,అధికారాల కంటే ప్రజల హక్కులు,సామాజిక న్యాయానికి ప్రాధాన్యతనిస్తూ జీవితాంతం ప్రజాసేవకు అంకితమైన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం, త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు.బాపూజీ ఆశయాలను నేటి తరం ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరైన కొండా లక్ష్మణ్ బాపూజీ గ్లోబల్ ఫెడరేషన్ హనుమకొండ జిల్లా కన్వీనర్, సీనియర్ జర్నలిస్ట్ మెండు రవీందర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యోద్యమంలో చురుకైన పాత్ర పోషించిన బాపూజీ సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారంతో గౌరవించాలని కోరారు. నిస్వార్థ ప్రజాసేవ, విలువలతో కూడిన రాజకీయ జీవితం, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు.అనంతరం పేదలకు అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ మంత్రి కాశయ్య, రాచర్ల అశోక్,తవుటం మధుసూదన్, మాజీ కౌన్సిలర్లు పొరండ్ల సంతోష్, చిదురాల దేవేందర్,పోపా ప్రధాన కార్యదర్శి దుంపేటి నాగరాజు,దార్న వేణుగోపాల్,దార్న కుమారస్వామి,గాదె శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ భూముల పరిరక్షణలో నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలి..

- తుడుం దెబ్బ రాష్ట్ర ప్రచార కార్యదర్శి రేగా గణేష్..

సెప్టెంబర్ 27. డిడి9 వార్త వెంకటాపురం.

ఏజెన్సీ ప్రాంతాల్లో అమలులో ఉన్న ఎల్‌టీఆర్, 1/70 చట్టాలను కఠినంగా అమలు చేయడంతో పాటు ప్రభుత్వ భూములను పరిరక్షించాలని తుడుం దెబ్బ (ఆదివాసీ హక్కుల పోరాట సమితి) రాష్ట్ర ప్రచార కార్యదర్శి రేగా గణేష్ డిమాండ్ చేశారు.

నుగూరు గ్రామంలో తుడుం దెబ్బ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఐదవ షెడ్యూల్ ప్రాంతమైన ఏజెన్సీలో ప్రభుత్వ భూములు గిరిజనేతరుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. అయితే ప్రభుత్వ భూములకు గిరిజనేతరులకు పట్టాలు ఎలా మంజూరు చేస్తారని ప్రశ్నించారు.ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమంగా పట్టాలు పొందిన వారిపై, అలాగే వాటికి సహకరించిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ చట్టాల అమలుపై అవగాహన లేకుండా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలపై వెంకటాపురం తహసీల్దార్‌పై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

వెంకటాపురం మండలంలోని గిరిజనేతరుల ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినప్పటికీ, ఆ ఆదేశాల అమలులో నిర్లక్ష్యం జరుగుతోందని రేగా గణేష్ ఆరోపించారు. ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా మంజూరైనట్లు ఆరోపణలు ఉన్న పట్టాలను పరిశీలించి, చట్టబద్ధత లేనివిగా తేలితే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ భూములను వెంటనే పరిరక్షించి, ఆక్రమణలపై చర్యలు తీసుకోకపోతే వెంకటాపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట తుడుం దెబ్బ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపడతామని రేగా గణేష్ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆదివాసీ నాయకులు పాయం కృష్ణ, పాయం శశికుమార్, పోడెం వినయ్ కుమార్, ఇండ్ల లక్ష్మీనారాయణ, పంది బన్నీ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలు

- తెలంగాణ ఉద్యమానికి బాపూజీ సేవలు చిరస్మరణీయం

ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: సెప్టెంబర్ 27: (డిడి 9 వార్త న్యూస్):

బోథ్: బోథ్ పట్టణంలోని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ జాతిపిత శ్రీ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో బోథ్ సర్పంచ్ కుర్మే అన్నపూర్ణ మహేందర్, ఉపసర్పంచ్ పూర్ణు విజయరెడ్డి, ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, బోథ్ మండల అధికార ప్రతినిధి ఆలపాటి అచ్యుత్ రెడ్డి, వార్డు మెంబర్ మెడిచేల్మా ప్రవీణ్‌తో పాటు బోథ్ పట్టణ పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బోథ్ పట్టణ పద్మశాలి అధ్యక్షులు మేరుగు భోజన్న మాట్లాడుతూ, తెలంగాణ సమాజం కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన పోరాటం, త్యాగాలు, సామాజిక సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు, పట్టణ ప్రముఖులు, ప్రజలు పాల్గొని కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళులు అర్పించారు.



జోనల్ స్థాయిలో ఎన్నికైన వేదం విద్యార్థి

ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: సెప్టెంబర్ 27: (డిడి 9 వార్త న్యూస్):

బోథ్ మండలంలోని స్థానిక వేదం పాఠశాల విద్యార్థి కనుగుట్ట గ్రామానికి చెందిన ఏడవ తరగతి చదువుతున్న మహాశ్రీ జిల్లా స్థాయిలో జరిగిన యు 14 విభాగంలో జరిగిన కరాటే పోటీల్లో జోనల్ స్థాయిలో ఎన్నికయింది . ఎన్నికైన విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పచ్చిపాల సంతోష్ , మరియు కరాటే మాస్టర్ రాజేశ్వర్ సార్ గ్రామస్తులు అభినందించారు





మల్లక్కపేట హనుమాన్ ఆలయంలో దొంగల బీబత్సం...!

- **హుండీ మాయం...భద్రతా వైఫల్యంపై భక్తుల్లో ఆందోళన**
- **23 నుంచి పనిచేయని సీసీ కెమెరాలు.. అదే సమయంలో చోరీ**
- **ఆలయంపై అవగాహన ఉన్నవారేనా..? పోలీసుల దర్యాప్తుపైనే ఉత్కంఠ**

పరకాల,సెప్టెంబర్ 27, డి డి 9వార్త

హన్మకొండ జిల్లా పరకాల ప్రాంతంలోని ప్రముఖ మల్లక్కపేట అభయాంజనేయ స్వామి ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరగడం కలకలం రేపింది. ఆలయం లోని హుండీ మాయమవడంతో భక్తుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.ఆలయానికి ప్రతిరోజూ వెళ్లే జగన్నాథ ఆచార్యులు ఆదివారం ఉదయం పూజల కోసం వెళ్లగా హుండీ కనిపించకపోవడంతో విషయాన్ని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిష్ఠాత్మక ఆలయంలో భద్రత ప్రశ్నార్థకం..!?

మల్లక్కపేట అభయాంజనేయ స్వామి ఆలయం పరకాల ప్రాంతంలోనే కాకుండా తెలంగాణలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా పేరుగాంచింది. శ్రీరామనవమి,హనుమాన్ జయంతి, కార్తీక మాస పూజలు తదితర వేడుకలు వైభవంగా నిర్వహిస్తుండటంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు.అలాంటి ఆలయంలో హుండీ చోరీకి గురికావడం ఆలయ భద్రతపై ప్రశ్నలు తలెత్తేలా చేసింది.

సీసీ కెమెరాలు పనిచేయకపోవడమే అవకాశమా....?

ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ,పిడుగు పడటంతో ఈ నెల 23వ తేదీ నుంచి అవి పనిచేయడం లేదని సమాచారం. సరిగ్గా ఇదే సమయంలో ఆలయంలో చోరీ జరగడం పలు అనుమానాలకు తావిస్తోంది.కెమెరాలు పనిచేయని విషయం దొంగలకు ముందే తెలుసా..? లేక ఇది యాదృచ్ఛికమా..? అనే ప్రశ్నలు భక్తుల్లో వ్యక్తమవుతున్నాయి.

ఆలయ పరిస్థితులపై తెలిసినవారేనా..?

రోడ్డు పక్కనే ఉన్న ఆలయంలోకి దొంగలు చొరబడి హుండీని ఎత్తుకెళ్లిన ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆలయ నిర్మాణం,హుండీ ఉన్న ప్రదేశం, పరిసర పరిస్థితులపై అవగాహన ఉన్నవారే ఈ ఘటనకు పాల్పడ్డారా అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని భక్తులు అభిప్రాయపడుతున్నారు. అయితే చోరీ వెనుక అసలు కారణాలు, నిందితుల వివరాలు పోలీసుల దర్యాప్తులోనే తేలాల్సి ఉంది.

హుండీలో ఎంత నగదు ఉంది..?

ఆలయ హుండీని సాధారణంగా ఆరు నెలలకు ఒకసారి లెక్కిస్తారని తెలుస్తోంది.గత మే నెలలో హనుమాన్ జయంతి అనంతరం హుండీని లెక్కించినట్లు సమాచారం. ప్రస్తుతం హుండీలో రూ.10 వేల లోపు నగదు ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.అయితే అసలు ఎంత నగదు ఉందన్నది హుండీ లెక్కింపు అనంతరం మాత్రమే స్పష్టమవుతుంది.

భక్తుల విశ్వాసానికి భరోసా కల్పించాలి...

ప్రతిరోజూ భక్తులు వచ్చే ప్రముఖ ఆలయంలో భద్రతా ఏర్పాట్లు మరింత పటిష్టం చేయాలని భక్తులు కోరుతున్నారు. పనిచేయని సీసీ కెమెరాలను వెంటనే పునరుద్ధరించడంతో పాటు రాత్రివేళ భద్రతను పెంచాలని,ఆలయ పరిసరాల్లో నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.చోరీ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు.




మహిళల అక్షరాస్యతే లక్ష్యం

- **'అమ్మకు అక్షరమాల'తో నిరక్షరాస్యతకు చెక్**

నిజామాబాద్, సెప్టెంబర్ 27 (డీడీ 9 వార్త):

రాష్ట్రంలో ఏ మహిళ కూడా చదువు రాకుండా ఉండకూడనే లక్ష్యంతో ప్రభుత్వం 'అమ్మకు అక్షరమాల' కార్యక్రమాన్ని చేపట్టిందని ఐకెపి ఏపీఎం కిరణ్ కుమార్ తెలిపారు. కమ్మర్‌పల్లి మండలంలోని 12 గ్రామాల్లో గ్రామ సమైక్య సంఘాల ఆధ్వర్యంలో చదువురాని మహిళలను గుర్తించి 'ఉల్లాస్' పరీక్ష నిర్వహించారు. కోన సముందర్ గ్రామంలో ఐకెపి సీసీ ఏడేళ్లి రవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉల్లాస్ పరీక్షను ఐకెపి ఏపీఎం కిరణ్ కుమార్, గ్రామ సర్పంచ్ బెజ్జారాపు రాకేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో చదువు రాని మహిళలను గుర్తించి వారికి 'అమ్మకు అక్షరమాల' ద్వారా గ్రామ సమైక్య సంఘాల ఆధ్వర్యంలో రాత్రి వేళల్లో చదువు నేర్పిస్తున్నామని తెలిపారు. శిక్షణ అనంతరం ఉల్లాస్ ద్వారా పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని 12 గ్రామాల్లో మొత్తం 1,220 మంది మహిళలు ఈ పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. గ్రామాల్లో ఒక్క మహిళ కూడా నిరక్షరాస్యురాలిగా మిగలకుండా ప్రతి ఒక్కరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే 'అమ్మకు అక్షరమాల' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అనంతరం సర్పంచ్ బెజ్జారాపు రాకేష్ మాట్లాడుతూ మహిళలకు అక్షరజ్ఞానం అందించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమన్నారు. మహిళలు చదువుకోవడం ద్వారా కుటుంబంతో పాటు సమాజానికి కూడా ఎంతో ఉపయోగం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సీసీ పి. రియా, గ్రామ సమైక్య సంఘం అధ్యక్షురాలు బట్టల మౌనిక, నస్రిన్ బేగం, సీఏలు నాయనా, బాలమణి, దుంపల లత, రామ మహిళా సంఘం సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



రోజు రోజుకి రెచ్చిపోతున్న భూ అక్రమార్కులు

- **నిమ్మకు నీరెత్తని విధంగా రెవెన్యూ అధికారులు**
- **వార్త కథనాలు రాస్తే అధికార పార్టీ లో కొంతమంది నాయకుల బెదిరింపులు**
- **అక్రమార్కులకు సహకరిస్తున్న తోక పత్రిక విలేకరులు**
- **జిల్లా కలెక్టర్,స్థానిక ఎమ్మెల్యే చొరవతో అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్న ప్రజలు**

శాయంపేట, సెప్టెంబర్ 27,డి డి 9వార్త

హనుమకొండ జిల్లా శాయంపేటలో రోజురోజుకు చెలరేగిపోతున్న భూ అక్రమార్కులు. రెవెన్యూ అధికారులు మాత్రం చూసి చూడనట్టుగా నిమ్మకు నీరు ఎత్తెని విధంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.మండల కేంద్రంలో సీతకుంట మొదలుకొని పెద్దకొడపాక శివారు,పత్తిపాక ఇలా చెప్పుకుంటూ పోతే రోజురోజుకు భూ అక్రమార్కులు చెలరేగిపోతూ ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఇందుకు రెవెన్యూ అధికారులే వారిని పెంచి పోషిస్తున్నారా లేక అక్రమార్కులకు,ప్రజా ప్రతినిధులకు భయపడుతూ వదిలేస్తున్నారా..? అంటూ వాదనలు వినిపిస్తున్నాయి. మండలంలో ఎక్కడ ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని ఆరోపణలు రాగానే అధికారులు మాత్రం నామ మాత్రంగా నోటీసులు ఇస్తూ వారిపై చర్యలు తీసుకోకుండా వదిలేయడం మూలంగానే రోజురోజుకు ఈ దందాలు ఎక్కువైతున్నాయని అధికారులు అక్రమార్కులు భయపడేలా కఠిన చర్యలు తీసుకొని ఉంటే ఇలా జరగకుండా అడ్డుకట్ట వేయగలరు కానీ... ఎక్కడ కూడా అక్రమార్కులకు దడ పుట్టించేలా రెవెన్యూ అధికారుల వ్యవహారం కనిపించడం లేదని అక్రమార్కులపై నోటీసులు ఇచ్చినా కూడా మళ్లీ అదే తరహాలో ఎగబడుతున్నారంటే అధికారులపై అక్రమార్కులకు భయం లేక మాకు ఎదురు లేదులే అనే విధంగ వ్యవహరించడం పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఈ భూ దందాలలో మాత్రం అసలు అధికార పార్టీలో ఉన్న కొంతమంది నాయకులు వారికి సహకరించే పత్రిక విలేకరులు కూడా ఉన్నారేమో అందుకే అధికారులు మౌనం వహిస్తున్నారని సీనియర్ సిటిజన్స్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే స్పందిస్తారా వారు కూడా మౌనం వహిస్తారా...

శాయంపేట మండలంలో రోజురోజుకీ పెరిగిపోతున్న భూ దందాలపై జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే స్పందిస్తారా లేక మండలంలోని రెవెన్యూ అధికారుల వలె వారు కూడా



మౌనం వహిస్తారా అంటూ మండల వ్యాప్తంగా చర్చ జరుగుతుంది. మండలంలో ఎక్కడ భూదందాలు జరిగిన అధికార పార్టీలో ఉన్న కొందరు నాయకులు, వారికి సహకరించే తోక పత్రిక రిపోర్టర్లు ఇలా కూటమిగా ఏర్పడితేనే అక్రమాలు పెరిగిపోతున్నాయని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతుంటే పలు పత్రికలలో వార్త కథనాలు వెలువడినా కూడా ఇప్పటివరకు జిల్లా కలెక్టర్ స్థానిక ఎమ్మెల్యే స్పందించకపోవడం విడ్డూరంగా ఉంది.అక్రమాలు జరుగుతున్నాయని వార్త కథనాలు రాస్తే కొంతమంది తెలిసి తెలియని విలేకరులను అండగా పెట్టుకొని అధికార పార్టీ నాయకులు బెదిరించడం, భయభ్రాంతులకు గురి చేయడం లాంటివి మండలంలో కోపల్లెలుగా జరుగుతున్నాయి.ఇకనైనా జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులపై తగు చర్యలు తీసుకొని,స్థానిక ఎమ్మెల్యే తమ పార్టీలో ఉన్న కలుపు మొక్కలను ఏరివేస్తూ తమ గౌరవానికి భంగం కలగకుండా చూసుకుంటారో లేదో వేచి చూడాలి మరి.జిల్లా అధికారులు స్థానిక ఎమ్మెల్యే సమన్వయంతో శాయంపేట మండలంలో ఎక్కడా కూడా అక్రమాలు జరగకుండా అడ్డుకట్ట వేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



నిజామాబాద్ జిల్లాలో ముగిసిన ఉల్లాస్ పరీక్షలు

- **హాజరైన 30,876 మంది అభ్యాసకులు..**
- **97.40% నమోదు**

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 27(డీడీ9 వార్త) :

జిల్లా వ్యాప్తంగా నవ భారత అక్షరాస్యత కార్యక్రమం "అమ్మకు అక్షరమాల"లో భాగంగా నిర్వహించిన ఫ్లనట్ ఎఫ్ఎల్ఎన్ఏటీ/ఎన్ఐఓఎస్ పరీక్షలు ఆదివారం ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. డీఆర్‌డీఏ సెర్ప్, మెప్మా మరియు వయోజన విద్యాశాఖల సంయుక్త సమన్వయంతో జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, కేంద్రాల్లో ఈ పరీక్షలను నిర్వహించారు. మొత్తం 31,702 మంది అభ్యాసకుల లక్ష్యానికి గాను ఏకంగా 30,876 మంది 97.40 శాతం హాజరై తమ అక్షరాస్యత నైపుణ్యాన్ని నిరూపించుకున్నారు. బోర్గాం (పి) కేంద్రంలో పరీక్ష తీరును అదనపు కలెక్టర్ పి.భుజంగరావు పరిశీలించగా, నిజామాబాద్ మేయర్ కే.ఉమారాణి మాణిక్ భవన్, కోటగల్లి పాఠశాలల్లో అభ్యాసకులను పలకరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ జి.సాయన్న, వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ ఏ.పురుషోత్తం, ఏపీడీ మధుసూదన్, ఇతర అధికారులు, సీసీలు, వీఓఏలు సేవాలందించారని, విజయంలో భాగస్వాములైన అధికారులందరికీ పీడీ సాయన్న ధన్యవాదాలు తెలిపారు.



ఉప్లూర్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- **నలుగురు లబ్ధిదారులకు రూ.2.36 లక్షల ఆర్థిక సాయం**


నిజామాబాద్, సెప్టెంబర్ 27 (డీడీ 9 వార్త):

అనారోగ్య చికిత్సకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలిచింది. కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామానికి చెందిన నలుగురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గ్రామ సర్పంచ్ ఏనుగందుల శైలేందర్ ఆదివారం పంపిణీ చేశారు. మొత్తం రూ.2.36 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ శైలేందర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారుల్లో ఆసియా భానుకు రూ.30 వేలు, రెంజర్ల భారతికి రూ.60 వేలు, నరవోయిన గంగుకు రూ.30 వేలు, తక్కురి లక్ష్మికి రూ.1.16 లక్షల చొప్పున సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసినట్లు తెలిపారు.

చెక్కుల మంజూరుకు కృషి చేసిన బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ సభ్యులు బాస వేణుగోపాల్ యాదవ్‌కు లబ్ధిదారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ తక్కరి ముత్యం, వార్డు సభ్యులు విభూది అనిల్, ప్రభుత్వ ఏజీపీ సరసం చిన్నారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఏలేటి మోహన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు తిప్పిరెడ్డి శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు డాక్టర్ నరేష్, మండల అధ్యక్షుడు బోనగిరి భాస్కర్, నాయకులు ఆంజనేయులు, సాధుల్లా, నజీర్, ఉబేద్, క్రాంతిరెడ్డి, అనిల్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.



తాళ్లు తెంపుతుండగా కిందపడి యువకుడి దుర్మరణం

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 27(డీడీ9 వార్త) :

గణేశ్ మండపం కట్టెల తాళ్లను విప్పుతున్న క్రమంలో ఓ యువకుడు ఆకస్మికంగా కుప్పకూలి ప్రాణాలు కోల్పోయిన సంఘటన సాలూర మండలం ఖాజాపూర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. బోధన్ రూరల్ ఎస్సై రాజ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... ఖాజాపూర్ గ్రామానికి చెందిన భాస్కర్ (19) ఉదయం 10:30 గంటల సమయంలో తన స్నేహితులతో కలిసి వినాయక మండపానికి కట్టిన కట్టెల తాళ్లను తెంపేందుకు వెళ్లాడు. ఆ పనిలో ఉండగానే ఒక్కసారిగా స్పృహతప్పి కిందపడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆందోళనతో అతడిని వెంటనే బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



క్రీడా ప్రతిభకు 'ఇందూరు' వేదిక.. రాష్ట్రస్థాయి అస్మిత సైక్లింగ్ పోటీలు ప్రారంభం


- **జెండా ఊపి ప్రారంభించిన ఎంపీ ధర్మపురి అరవింద్**
- **33 జిల్లాల నుంచి క్రీడాకారుల హాజరు.. కలకలలాడిన బైపాస్ రోడ్డు**
- **మాజీ మంత్రి స్వర్గీయ డి. శ్రీనివాస్ జయంతి నివాళులు**


నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 27(డీడీ9 వార్త) :

నిజామాబాద్ నగరం క్రీడా సందడితో కళకళలాడింది. జిల్లాలో క్రీడారంగానికి మరింత ప్రోత్సాహం అందించే దిశగా 'ఖేలో ఇండియా' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి 'అస్మిత' రోడ్ సైక్లింగ్ పోటీలు ఆదివారం ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. స్థానిక ఇందూరు బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఈ పోటీలను నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అస్మిత సైక్లింగ్ పోటీల్లో నిజామాబాద్ జిల్లా నుంచే అత్యధిక సంఖ్యలో క్రీడాకారులు రిజిస్ట్రేషన్లు నమోదు చేసుకోవడం ఎంతో గర్వకారణమని ఆనందం వ్యక్తం చేశారు. యువత కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, ఇటువంటి వేదికలను ఉపయోగించుకుని తమ ప్రతిభను రాష్ట్ర, జాతీయ స్థాయిలో చాటుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో సైక్లిస్టులు రావడంతో ఇందూరు బైపాస్ రోడ్డు రోజంతా క్రీడా శోభతో మెరిసిపోయింది.

'డిఎస్' విగ్రహానికి ఘన నివాళి:

పోటీల ప్రారంభం అనంతరం ఎంపీ ధర్మపురి అరవింద్ తన తండ్రి, మాజీ మంత్రి, మాజీ పీసీసీ అధ్యక్షుడు స్వర్గీయ డి.శ్రీనివాస్ జయంతి సందర్భంగా కంటేశ్వర్ బైపాస్ చౌరస్తాకు చేరుకున్నారు. అక్కడున్న డి.శ్రీనివాస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తన తండ్రి ఉమ్మడి రాష్ట్రంలో ప్రజాప్రతినిధిగా, మంత్రిగా ప్రజలకు అందించిన నిరుపమాన సేవలను, నిజామాబాద్ జిల్లా అభివృద్ధికి చేసిన కృషిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, నగర మేయర్ నీతూ ఉమారాణి, రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, కార్యదర్శి విజయకాంత్ రావు, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కృపాకర్ రెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఈగ సంజీవరెడ్డి, కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, సీనియర్ న్యాయవాది రాజేందర్ రెడ్డి, ఎస్ఆర్ విద్యాసంస్థల డీజీఎం గోవర్ధన్ రెడ్డిలతో పాటు పలువురు నగర కార్పొరేటర్లు, క్రీడా ప్రాధికార సంస్థ ప్రతినిధులు, 33 జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు.









నషాముక్త భారత్‌తోనే వికసిత భారత్ స్వప్నం సాకారం

- **జిల్లా అదనపు కలెక్టర్ భుజంగరావు**

నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 27(డీడీ9 వార్త) :

యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ అమూల్యమైన జీవితాలను నాశనం చేసుకోవద్దని నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ పి.భుజంగరావు పిలుపునిచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, మేరా యువ భారత్ సంయుక్త ఆధ్వర్యంలో 'నషాముక్త యువ సేవ భారత్' 100 ఆదివారాల కార్యక్రమంలో భాగంగా 'నా ఆరోగ్యమే నా గర్వకారణం' అనే నినాదంతో ఆదివారం ప్రత్యేక అవగాహన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ నషాముక్త భారత్ అభియాన్ సంతకాల సేకరణను ప్రారంభించి, విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... డ్రగ్స్ రహిత భారత దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ముఖ్యంగా ప్రొఫెషనల్, ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థుల ప్రవర్తనను తల్లిదండ్రులు ప్రతిరోజు గమనిస్తుండాలని సూచించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రాజశ్రీ మాట్లాడుతూ... యువత ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతి ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా హాజరైన విద్యార్థులకు ఉచితంగా బిపి, షుగర్, టిబి, ఎక్స్‌రే మరియు ఇతర రక్త పరీక్షలతో పాటు మానసిక ఆరోగ్యానికి సంబంధించి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు వెల్లడించారు. మానసిక సమస్యలు ఉన్నవారు టోల్ ఫ్రీ నెంబర్ 14416కు కాల్ చేసి జిల్లా సైకియాట్రిస్ట్ ద్వారా చికిత్స పొందవచ్చని సూచించారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ విశాల్ మాట్లాడుతూ... యువతే దేశానికి నిజమైన శక్తి అని, వ్యసనాలకు బానిసలైన వారిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని డిఅడిక్షన్ సెంటర్‌కు రిఫర్ చేస్తే ఉచిత చికిత్స అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మొత్తం 127 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాములు, మేరా యువభారత్ జిల్లా అధికారి రమేష్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సికందర్ నాయక్, ప్రోగ్రామ్ అధికారులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గణేశ్ నిమజ్జనోత్సవాలు
సీపీ పి.సాయి చైతన్య

నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 27(డీడీ9 వార్త) :


నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గణేశ్ విగ్రహాల ప్రతిష్టాపన నుంచి నిమజ్జనం వరకు నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయని పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలో మొత్తం 5,811 గణేశ్ విగ్రహాలను ప్రతిష్టించగా, భక్తులు భక్తిశ్రద్ధలతో నవరాత్రులు పూర్తి చేసుకుని ప్రశాంతంగా నిమజ్జనం పూర్తి చేశారని వివరించారు. బాసర బ్రిడ్జి, ఉమ్మెడలతో పాటు ఇతర నిమజ్జన ప్రాంతాల వద్ద పటిష్ట బందోబస్తు మరియు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టడం వల్ల ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయని పేర్కొన్నారు. ఈ వేడుకలు విజయవంతం కావడానికి సార్వజనిక్ గణేశ్ మండలి, ఉత్సవ కమిటీలు, మసీదు కమిటీలు మరియు అన్ని మతాల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పోలీసు శాఖకు పూర్తి స్థాయిలో సహకరించారని సీపీ అభినందించారు. అలాగే రెవెన్యూ, మున్సిపల్, గ్రామ పంచాయతీ, అబ్కారీ, అగ్నిమాపక శాఖల అధికారులు, ఎన్.సి.సి, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు, గజ ఈతగాళ్లు విశేష సేవలు అందించారని కొనియాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో మరియు సమాచార మార్పిడిలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు అందించిన సహకారానికి సీపీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



బాలికల వసతి గృహంలో ఉచిత కరాటే శిక్షణ ప్రారంభం

బోధన్, నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 27(డీడీ9 వార్త) :

బాలికలలో ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు, స్వీయ రక్షణ నైపుణ్యాలను పెంపొందించేందుకు ఉచిత కరాటే శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని లయన్స్ క్లబ్ పిడీజీ లయన్ వేమూరి లక్ష్మి పేర్కొన్నారు. బోధన్ పట్టణం రాకాసిపేటలోని వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహంలో లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ అయ్యప్ప సేవ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కరాటే శిక్షణ తరగతులను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా బాలికలు తమ రక్షణ తామే చేసుకునేలా ఆత్మరక్షణ విద్యల్లో మెళకువలు నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ శిక్షణ తరగతులను ప్రతి ఆదివారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కరాటే పల్లవి చైర్మన్‌గా ఈ శిక్షణ కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించి నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజినల్ సెక్రటరీ లయన్ బాలగంగాధర్, డిస్ట్రిక్ట్ ఐ క్యాంప్ చైర్మన్ లయన్ గోవింద్ రెడ్డి, జోనల్ చైర్మన్ లయన్ సురాబత్తుని శ్రీనివాసరావు, క్లబ్ సెక్రటరీ లయన్ గుడిపల్లి గంగారెడ్డి, లయన్ కుమ్మరిపోశెట్టి, లయన్ థామసయ్య, లయన్ మారం ఆదినారాయణ రెడ్డి, లయన్ ఆంతోని మేరి, లయన్ కరాటే పల్లవి, మహమ్మద్ అబ్దుల్ లతీఫ్, మేడగం సంతోష్ రెడ్డి, వసతి గృహ ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.






రాష్ట్రస్థాయి ఉషు పోటీలకు అడ్మూపూర్ విద్యార్థులు ఎంపిక

- **రాష్ట్రస్థాయి ఉషు పోటీలకు అడ్మూపూర్ విద్యార్థులు ఎంపిక**

బోధన్, నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 27(డీడీ9 వార్త) :

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి ఉషు క్రీడా పోటీల్లో బోధన్ మండలం అడ్మూపూర్ పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పలు పతకాలను సొంతం చేసుకున్నారు. అండర్ 17 విభాగంలో పాఠశాలకు చెందిన విద్యార్థులు తడపు అఖిల్, శివమ్, మీనాక్షి ప్రతిభ చాటి స్వర్ణ పతకాలను కైవసం చేసుకున్నారు. బంగారు పతకాలు సాధించిన ఈ ముగ్గురు క్రీడాకారులు త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి ఉషు పోటీలకు ఎంపికయ్యారు. ఇదే పాఠశాలకు చెందిన సింధూబాయి, గంగోత్రి వెండి పతకాలను సాధించగా, సునీత, మౌనిక, శాలీం రాజ్ కాంస్య పతకాలు గెలుచుకుని పాఠశాలకు పేరు తీసుకువచ్చారు. క్రీడా పోటీల్లో క్రమశిక్షణ, పట్టుదలతో పాల్గొని పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సూర్యకుమార్, వ్యాయామ ఉపాధ్యాయురాలు సునీత, ఉపాధ్యాయ బృంద, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విద్యార్థులు మరింతగా ప్రమించి ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.





బాపూజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: మేయర్ ఉమారాణి

నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 27(డీడీ9 వార్త) :

తెలంగాణవాది, స్వాతంత్ర్య పోరాట యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలను జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిజామాబాద్ నగరంలో ఘనంగా నిర్వహించారు. వినాయకనగర్‌లోని బాపూజీ విగ్రహానికి నగర మేయర్ కూరగాయల ఉమారాణి, అదనపు కలెక్టర్ పి.భుజంగరావు, బీసీ, పద్మశాలి కుల సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి జయంతి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్, అదనపు కలెక్టర్ లు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తుది శ్వాస వరకు అంకితభావం, నిజాయితీతో కృషి చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలోనే కాకుండా దేశ స్వాతంత్ర్య పోరాటంలోనూ ఆయన చురుగ్గా పాల్గొన్నారన్నారు. తెలంగాణ భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ, చట్టసభల్లో గళమెత్తి తన మంత్రి పదవిని కూడా తృణప్రాయంగా వదులుకున్న గొప్ప త్యాగశీలి అని స్మరించుకున్నారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తూ, ప్రజల అభ్యున్నతి కోసం ఆయన సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమని, బాపూజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సాయికుమార్, పద్మశాలి, బీసీ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



అక్షరాస్యత పెంచడానికి ఉల్లాస్ శిక్షణ...

సెప్టెంబర్ 27 (డీడీ9 వార్త) ప్రతినిధి

మెదక్ జిల్లాలోని తూప్రాన్ మున్సిపల్ కార్యాలయం లో ఆదివారం నిరక్షరాస్యతపై ఉల్లాస్ ఉద్యమం అక్షరాస్యత శిక్షణ SHG మహిళలు. మెదక్ జిల్లా తూప్రాన్, రామాయంపేట, మెదక్ మున్సిపాలిటీలలో ఉల్లాస్ కార్యక్రమం 15 ఏళ్లు దాటిన నిరక్షరాస్యులకు అక్షర జ్ఞానం 1200 మందికి 3 నెలల శిక్షణ మెదక్ జిల్లాలో అక్షరాస్యత శాతం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమాన్ని మెప్మా ఆధ్వర్యంలో అమలు చేస్తున్నారు.
ఇందులో భాగంగా 15 సంవత్సరాలు దాటిన నిరక్షరాస్యులను గుర్తించి, వారికి అక్షరాలు నేర్పించేందుకు స్వయం సహాయక సంఘాలలో చదువుకున్న మహిళలను అక్షరాస్యత (వాలంటీర్లు) గా నియమించారు.
తొలి విడతలో రామాయంపేట మున్సిపాలిటీ 200 మంది తూప్రాన్ మున్సిపాలిటీ 200 మంది సదాశివపేట, మెదక్ మున్సిపాలిటీలలో మరో 600 మందికి పైగా మొత్తం దాదాపు 1200 మంది నిరక్షరాస్యులను గుర్తించి, సాయంత్రం వేళల్లో SHG సభ్యులతో 3 నెలల పాటు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు మెదక్ మెప్మా పిడి హన్మంత్ రెడ్డి తెలిపారు
ఈ కార్యక్రమంపై ఆదివారం తూప్రాన్ లో మెప్మా PD హనుమంత్ రెడ్డి ప్రెస్ మీట్ నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడించరు . శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఫౌండేషన్ సర్టిఫికెట్లు అందజేస్తామని ఆయన తెలిపారు.
ఈ సమావేశంలో సంబంధిత మున్సిపాలిటీల TMCలు, RPలు పాల్గొన్నారు.




ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా
మున్సిపల్ కమిషనర్ పర్యటన

- **కోమటి చెరువు, రూబీ నెక్లెస్ రోడ్ పరిసరాల్లో పారిశుద్ధ్య పనుల పరిశీలన**

సిద్దిపేట, డీడీ9 వార్త :

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ మల్లి కార్జున్ పట్టణంలోని పర్యాటక ప్రాంతాల్లో పర్యటించారు. కోమటి చెరువు, రూబీ నెక్లెస్ రోడ్ పరిసరాల్లో వాకింగ్, సైక్లింగ్ చేస్తూ పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.
పర్యాటక ప్రాంతాల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని కమిషనర్ సూచించారు. పట్టణ పరిశుభ్రతతో పాటు పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించేలా వాకింగ్, సైక్లింగ్ వంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ప్రాధాన్యతను సంతరించుకుంది. పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు కూడా మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని అధికారులు కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.











శక్కర్ నగర సీఎస్ఐ చర్చిలో వయోవృద్ధుల ఆరాధనోత్సవం

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 27(డీడీ9 వార్త) :

బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ సీఎస్ఐ సెయింట్ పాల్ చర్చిలో వయోవృద్ధుల ఆరాధన కార్యక్రమాన్ని ఆదివారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి పరిధిలోని 65 సంవత్సరాలు పైబడిన వయోవృద్ధులను రెవ. ఎం. ప్రభాకర్ పాస్టర్, రెవ. డి.జ్యోతి రాజ్ చేతుల మీదుగా శాలువాలతో ఘనంగా సన్మానించి, చిన్న కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా దైవజనులు మాట్లాడుతూ.. చర్చి అభివృద్ధి లోనూ, ఆధ్యాత్మిక వృద్ధిలోనూ వయోవృద్ధుల పాత్ర ఎంతో కీలకమైనదని, వారి ప్రార్థనలు, అనుభవం సంఘానికి కొండంత బలమని పేర్కొన్నారు. 65 సంవత్సరాలు పైబడిన వారు దాదాపు 70 మందికి పైగా ఈ సంఘంలో ఉండటం దేవుడు ఇచ్చిన గొప్ప దీవెనగా భావిస్తున్నామని హర్షం వ్యక్తం చేశారు. సీనియర్ సిటిజన్స్ ఆరాధన మరియు సీఎస్ఐ ఫార్మేషన్ డే పక్షాన పాల్గొన్న వయోవృద్ధులందరినీ అభినందిస్తూ దైవాశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టరేట్ కమిటీ బాధ్యులు బి.ఎడ్వర్డ్ ముల్లర్, కె.పుష్పరాజ్, ఆర్.పి.యేసుదాస్, డి.పద్మ జ్యోతి, జి.సునీత డేవిడ్, బి.సుమన సాగర్, బి.సంపత్ కుమార్, బి. జయవంత్ లతో పాటు చర్చి కమిటీ ప్రతినిధులు, ప్రార్థనా బృందం, స్థానిక క్రైస్తవ సోదరీ సోదరులు పాల్గొన్నారు.



యాదగిరి గుట్టకు తరలిన తెలంగాణ ఉద్యమకారుల పోరమ్ నాయకులు

- **ఉద్యమకారుల పోరమ్ తొమ్మిదవ ఆవిర్భావ సభ**

జవహర్ నగర్, సెప్టెంబర్ 27, (డీడీ9 వార్త)

తెలంగాణ ఉద్యమకారుల పోరమ్ 9వ ఆవిర్భావం సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో ఏర్పాటుచేసిన ఆవిర్భావ సమావేశానికి జవహర్ నగర్ నుంచి ఉద్యమకారులు భారీ స్థాయిలో తరలి వెళ్లారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ సీమ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉద్యమకారులు పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జవహర్ నగర్ ఉద్యమకారుల పోరమ్ అధ్యక్షులు పిన్నోజు సుధాకర్ చారి, నాయకులు తాండ్ర జలంధర్, మూల సోమయ్య, ఆరూరి నరసింహ, ఖాసీం, పాము భాస్కర్, వెంకటేష్ గౌడ్, మొగిలి పాక పరశురాం, ఎల్ల స్వామి, ఆనంద్ ప్రకాష్, వెంకట నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.




బడ్జెట్లో 18 శాతం నిధులు విద్యకు కేటాయించాలి

- **ఆరుట్ల తరహాలో మండలానికి మూడు ప్రభుత్వ పాఠశాలలను నిర్మించాలి**
- **గబ్బిలాల పేటలో తెలంగాణ పీపుల్స్ ఫ్రెంట్ రౌండ్ టేబుల్ సమావేశం**

జవహర్ నగర్, సెప్టెంబర్ 27, (డీడీ9 వార్త):

తెలంగాణ పీపుల్స్ ఫ్రెంట్ ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా బస్సు యాత్రలో బడినిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు అందులో భాగంగా శనివారం రాత్రి జవహర్ నగర్ లోని గబ్బిలాల పేటకు చేరుకున్న బస్సు యాత్ర , బడినిద్ర చేపట్టారు .ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు.. ఈ సందర్భంగా తెలంగాణ పీపుల్స్ ఫ్రెంట్ ప్రొఫెసర పద్మజ షా, మాజీ ఐఏఎస్ అధికారులు ఆకునూరి మురళి, ఎన్ వి రెడ్డి,ఎం చెంప లాల్ , ఎన్ రుబీనా, సృజన యాదవ్, ముప్పురి కుమార్,నిఖిల్ విజయ్ కృష్ణ, పాలకూరి అశోక్ ప్రజా సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి మరీ దీనంగా ఉందని పాఠశాలలకు కనీసం ప్రహరీ గోడలు, మూత్రశాల, క్లాస్ రూమ్స్ బ్లాక్ బోర్డ్స్ వంటి కనీస సౌకర్యాలు కూడా లేవని బడ్జెట్లో విద్యకు 18 శాతం నిధులు కేటాయించి ఆరుట్ల తరహా పాఠశాలలను రాష్ట్ర వ్యాప్తంగా మండలానికి మూడు నిర్మించాలని వారన్నారు. గబ్బిలాల పేటలో విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాల అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇప్పటికే ప్రభుత్వ పాఠశాల కోసం స్థానిక నాయకులు కృషి చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదని వెంటనే ఇక్కడ ఆరుట్ల తరహా పాఠశాల నిర్మాణం చేపట్టాలని ,ప్రైవేటు విద్యాసంస్థలపై ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చి ఫీజుల నియంత్రణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.







ప్రభుత్వాల తీరుతో రైతాంగానికి తీరని అన్యాయం: నిజామాబాద్ ఎంపీ అరవింద్

- **బోధన్‌లో బీజేపీ కిసాన్ మోర్చా సైకిల్ యాత్ర ప్రారంభం**

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 27(డీడీ9 వార్త) :

గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు నిరుద్యోగులను, రైతులను దారుణంగా మోసం చేశాయని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ విమర్శించారు. రైతుల సమస్యల పరిష్కారం, ఇచ్చిన హామీల అమలును డిమాండ్ చేస్తూ బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ యాత్ర ఆదివారం బోధన్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఎంపీ అరవింద్ ఆదేశాల మేరకు కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పి.తిరుపతి రెడ్డి నేతృత్వంలో ప్రారంభమైన ఈ యాత్ర బోధన్ నుంచి జగిత్యాల వరకు దాదాపు 180 గ్రామాల మీదుగా సాగి అక్టోబర్ 4న ముగియనుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే వంద రోజుల్లో బోధన్ నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని చెప్పిన కేసీఆర్ రైతులను నట్టేట ముంచారని, కాళేశ్వరం ప్రాజెక్టు రూపకల్పనలో లోపాల వల్ల రూ. లక్ష కోట్ల ప్రజాధనం నీటిపాలైందని ధ్వజమెత్తారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, జాతీయ పసుపు బోర్డు సాధనతో పసుపు రైతులకు అంతర్జాతీయ మార్కెటింగ్ సౌకర్యం లభించిందని అరవింద్ తెలిపారు. రాబోయే కాలంలో పసుపు ధర క్వింటాలుకు రూ.40 వేలు దాటడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. షరతులు లేకుండా రూ.2 లక్షల రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయాలని, కౌలు రైతులకు రైతు భరోసా, అన్ని రకాల వడ్లకు బోనస్ అందించాలని, పంట నష్ట పోయిన రైతులను ఆదుకునేందుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను రాష్ట్రంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం: అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ ధ్వజం

ఎన్నికల సమయంలో రైతాంగానికి ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలను తీవ్రంగా వంచిస్తోందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వరంగల్ రైతు డిక్లరేషన్ అమలు చేస్తామని చెప్పి ఇప్పుడు రైతులను దగా చేస్తోందని ఆరోపించారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభిస్తామని చెప్పిన పాలకుల మాటలు నీటిమూటలయ్యాయని దుయ్యబట్టారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పంటల బీమా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకుంటుంటే, ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం పంటల బీమాను గాలికొదిలేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోడు భూములు సాగుచేసుకుంటున్న గిరిజనులకు పట్టాలు ఇవ్వకపోగా, అసైన్డ్ భూముల హక్కులనూ కాలరాస్తున్నారని ఆరోపించారు. ధరణి పోర్టల్ సమస్యలను సరిచేస్తామని చెప్పి, 'భూ భారతి' పేరుతో లక్షలాది ఎకరాల భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. గత ఐదేళ్ల లో ఎలాంటి వివాదాలు లేని భూములను సైతం ఈ జాబితాలోకి తెచ్చి రైతుల పొలాలను ఆన్‌లైన్‌లో లాక్ చేశారని మండిపడ్డారు. రైతు శ్రేయస్సే ధ్యేయంగా పనిచేసేది ఒక్క భారతీయ జనతా పార్టీయేనని, అన్నదాతల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ పసుపు బోర్డు చైర్మన్ లింగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులకర్ణి, మోహన్ రెడ్డి, పాసులేటి గోపికిషన్, సిర్ప సుదర్శన్, రావుబా గంగాధర్, శేషాంక్ తదితర నాయకులు, రైతులు పాల్గొన్నారు.









భద్రాచలంలో ఘనంగా సర్దార్ భగత్ సింగ్ 119వ జయంతి వేడుకలు

- **భగత్ సింగ్ ఆశయాలే నేటి యువతకు మార్గదర్శకం - డాక్టర్ భాను ప్రసాద్ , తిప్పిన.సిద్ధులు**
- **-పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో వేడుకలు**

భద్రాచలం, సెప్టెంబర్ 27 (డిడి9 వార్త)

"ఇంక్విలాబ్ జిందాబాద్" అనే నినాదం నేటికీ యువతలో విప్లవ చైతన్యాన్ని నింపుతూనే ఉందని వక్తలు అన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి, దేశ స్వాతంత్ర్యం కోసం కేవలం 23 ఏళ్ల వయసులోనే ప్రాణత్యాగం చేసిన అమరవీరుడు సర్దార్ భగత్ సింగ్ ఆశయాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.


అమరవీరుడు భగత్ సింగ్ 119వ జయంతి సందర్భంగా భద్రాచలంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (PDSU) ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పీడీఎస్‌యూ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థుల దేశభక్తి నినాదాలతో పాఠశాల ప్రాంగణం మార్మోగింది.

పీడీఎస్‌యూ భద్రాచలం డివిజన్ అధ్యక్షుడు దండుగుల రామ్‌చరణ్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి... మాజీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తిప్పని సిద్ధులు, డాక్టర్ భాను ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భగత్ సింగ్ కేవలం ఒక స్వాతంత్ర్య సమరయోధుడు మాత్రమే కాదని, భావి భారత యువతకు నిత్య స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. దేశంలో పెరిగిపోతున్న అసమానతలను, ప్రజా వ్యతిరేక విధానాలను ఎదిరించేందుకు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కేంద్ర శాసనసభలో భగత్ సింగ్ బాంబు విసిరిన ఘటనను ప్రస్తావిస్తూ... అది ఎవరికీ హాని తల పెట్టడానికి కాదని, అప్పగించిన బాధ్యతను, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ జాతికి హెచ్చరిక పంపేందుకేనని వక్తలు వివరించారు.

ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మునిగెల శివ ప్రశాంత్, డివిజన్ అధ్యక్షులు దండుగుల రాంచరణ్, నాయకులు సాయి, పల్లవి, రజిత తదితరులు పాల్గొన్నారు.









40 Pro | ZEISS 23mm f/1.88 1
40 Pro | ZEISS 23mm f/1.88 1

లేడీ ఓరియెంటెడ్ మూవీలో రెజీనా కసాండ్రా..



కంటెంట్ ఉన్న చిత్రాలు ఎంచుకుంటూ హీరోయిన్‌గా రాణిస్తున్న రెజీనా కసాండ్రా.. ఇప్పుడు మరో ప్రయోగానికి సిద్ధం అయినట్లు తెలుస్తోంది. 'సిల నేరంగిలిల్ సిల మనితర్గళ్' అండ్ 'బాంబ్' వంటి చిత్రాలతో దర్శకుడుగా గుర్తింపు తెచ్చుకున్న డైరెక్టర్ విశాల్ వెంకట్ దర్శకత్వంలో రాబోతున్న తదుపరి ప్రాజెక్టులో ఈ హీరోయిన్ ఓకే అయినట్లు తెలుస్తోంది. ఇదొక లేడీ ఓరియెంటెడ్ మూవీ అని తెలుస్తుండగా.. ఇందులో రెజీనా శక్తివంతమైన, బలమైన కేంద్ర పాత్రలో కనిపిస్తుందని తెలుస్తుంది. ఇక క్రేజీ ప్రాజెక్టు యొక్క రెగ్యులర్ షూటింగ్ ఇటీవల ఘనంగా స్టార్ట్ కాగా.. సైలెంట్‌గా చిత్రీకరణ పూర్తి చేస్తున్నారట మేకర్స్. అంతే కాకుండా.. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అండ్ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్‌కు చెందిన 'జి స్క్వాడ్' సంస్థలు ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. ఇక ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలోనే అధికారికంగా వెల్లడి కానున్నాయని తెలుస్తుండగా.. ప్రజెంట్ ఇందుకు సంబంధించిన పోస్టులు నెట్టింట సందడి చేస్తున్నాయి.

ఆ భారాన్ని మహిళలపై మోపడం ఆపండి!



సామాజిక మాధ్యమాల్లో స్త్రీ ద్వేషపూరిత చర్చను.. స్త్రీ, పురుషుల మధ్య పోరాటంగా చూడకూడదని అన్నారు హిందీ నటి కృతిసనన్. ఇటీవల బిహార్‌లోని జముయి జిల్లాలో ఓ మైనర్ విద్యార్థినిని చుట్టుముట్టి లైంగికంగా వేధించిన ఘటనపై సోషల్ మీడియాలో వ్యక్తమవుతున్న భిన్నాభిప్రాయాల నేపథ్యంలో.. ఆ సంఘటనను ప్రస్తావించకుండానే కృతి ఇన్‌స్టా స్టోరీలో ఈ వ్యాఖ్యలు చేశారు. "ఇది స్త్రీ, పురుషుల మధ్య పోరాటం కాదు. స్త్రీలను తక్కువగా చూసే పురుషులకు, అలాగే పితృస్వామ్యాన్ని ఒక సాంస్కృతిక విలువగా భావిస్తున్న స్త్రీలకు మధ్య జరుగుతున్న పోరాటం. లైంగిక హింస నుంచి తమను తాము ఎలా రక్షించుకోవాలో మహిళలకు ఇంకెంత కాలం బోధిస్తూనే ఉంటారు? పురుషులకు మహిళలను వేధించవద్దని ఎందుకు చెప్పడం లేదు? ఒక మైనర్‌పై అత్యాచారం జరిగినప్పుడు ఆ దారుణానికి పాల్పడిన వ్యక్తి మనస్తత్వం ఎలాంటిది అని ఎందుకు ప్రశ్నించరు? దానికి బదులుగా అందరూ ఆ అమ్మాయి ఏ దుస్తులు వేసుకుంది, ఎక్కడ ఉంది, ఎవరితో ఉంది, ఎందుకు బయటకు వెళ్లింది, ఆమె కుటుంబం ఎందుకు అనుమతించింది అని అడుగుతూనే ఉంటారు. తమను తాము సురక్షితంగా ఉంచుకునేందుకు మరింత జాగ్రత్తగా ఉండాలని మహిళలకు ప్రతిసారీ చెప్పడం ఆపండి. పురుషులకు మహిళలను గౌరవంగా చూడటం, తమ హద్దుల్లో ఉండడం నేర్పించాలి. వారి ప్రవర్తనకు బాధ్యత వహించడం, అంగీకారం, గౌరవం అంటే ఏమిటో తెలియజేయాలి. తప్పుగా ప్రవర్తించే పురుషుల తప్పుల భారాన్ని మహిళలపై మోపడం ఆపండి" అని అందులో పేర్కొన్నారు కృతి.

మీ ప్రయాణం ప్రత్యేకమైనది..



హీరో కార్తీ పోలీస్ శాఖపై చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కోయంబత్తూరులో జరిగిన 'మాజీ పోలీసు అధికారుల పబ్లిక్ వెల్ఫేర్ ట్రస్ట్' 10వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. తమిళనాడు పోలీసుల పనితీరు, వారిపై ఉండే ఒత్తిడి గురించి మాట్లాడుతూ.. 'ప్రస్తుత రోజుల్లో సోషల్ మీడియా ప్రభావం వల్ల పోలీస్ శాఖపై విపరీతమైన ఒత్తిడి పెరుగుతోంది. ఇన్‌స్టామార్ట్‌లో ఆర్డర్ చేసినట్టుగా, ప్రజలు ఒక గంటలోపే పోలీసులు నేరాన్ని పరిష్కరించాలని ఆశిస్తున్నారు. అయినప్పటికీ, పోలీసులు సోషల్ మీడియాను సమర్థవంతంగా ఉపయోగిస్తున్నారు. వారికి సెలవులు ఉండవు. కొత్త ప్రభుత్వం వారానికి ఒక రోజు సెలవు ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ సిబ్బంది కొరత కారణంగా అది ఇప్పటికీ కాగితాలపైనే ఉంది. ఇప్పుడు 10,000 మంది సిబ్బందిని నియమించబోతున్నారని వింటున్నాను. ఇది నిజంగా సంతోషించాల్సిన విషయం. అదంతా పక్కకు పెడితే పోలీసుల కోసం నేను ఒక్క విషయం చెప్పాలనుకుంటున్నాను.. ఎప్పుడూ మిమ్మల్ని మీరు మరెవరితోనూ పోల్చుకోకండి. మీకంటే ఎవరూ తక్కువ కాదు. మీకంటే ఎవరూ ఎక్కువ కాదు. మీతో ఎవరూ సమానం కాదు. మీ ప్రయాణం ప్రత్యేకమైనది. మీరు చరిత్ర సృష్టిం

సోషల్ మీడియా వివాదాలకు దూరంగా ఉండండి..



సోషల్ మీడియాలో జరిగే అనవసర వివాదాలకు దూరంగా ఉండాలని కోలీవుడ్ స్టార్ హీరో సూర్య (Suriya) తన అభిమానులకు సూచించారు. నెగిటివ్ పోస్టులకు స్పందిస్తూ సమయం వృథా చేసుకోవద్దని హితవు పలికారు. ఇటీవల తన అభిమాన సంఘాల సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

"సోషల్ మీడియాలో ఎవరో ఏదో పోస్ట్ చేశారని.. దానికి బదులిస్తే మనకీ వాళ్లకీ తేడా ఉండదు. మన పని మనం చేసుకుందాం.. వాళ్లను వాళ్లలాగే ఉండనిద్దాం. ఎదుటివారిని మార్చడం చాలా కష్టం. విమర్శించే వారికి సమాధానం చెబుతూ మీ శక్తిని వృథా చేసుకోకండి. మనం కేవలం ప్రేమను మాత్రమే పంచుదాం. ప్రతిరోజూ మీరు చేసే పనిపై దృష్టిపెట్టండి. కచ్చితంగా విజయం సాధిస్తారు" అని సూర్య వివరించారు.

ఇటీవల హీరో శివకార్తికేయన్ (Sivakarthikeyan).. 'సర్దార్ 2', 'మండాడి' (Mandaadi) చిత్ర బృందాలను అభినందిస్తూ చేసిన పోస్టులు సూర్య అభిమానుల మధ్య భిన్నాభిప్రాయాలకు దారితీశాయి. ఈ నేపథ్యంలో నెట్టింట జరుగుతున్న చర్చలను ఉద్దేశించే సూర్య ఈ వ్యాఖ్యలు చేసినట్లు అభిమానులు భావిస్తున్నారు. అయితే, సూర్య ఎవరి పేరు ప్రస్తావించకుండానే ఈ సున్నితమైన సందేశం ఇచ్చారు. ఈ ఏడాది 'కరుప్పు', 'విశ్వనాథ్ అండ్ సన్స్' వంటి వరుస బ్లాక్‌బస్టర్ విజయాలతో సూర్య మంచి ఫామ్‌లో ఉన్నారు. మలయాళ స్టార్ డైరెక్టర్ జీతు జోసెఫ్ దర్శకత్వంలో ఆయన నటించిన తదుపరి చిత్రం 'సీన్' (Scene). ఈ దీపావళి కానుకగా నవంబరు 6న ఈ సినిమా థియేటర్లలో సందడి చేయనుంది.



నన్ను అర్ధాంతరంగా తొలగించి అన్‌లక్కీ హీరోయిన్‌గా ముద్రవేశారు..

బాలీవుడ్‌లో వరుస సినిమాలతో దూసుకుపోతున్న స్టార్ బ్యూటీ తాప్సీ పన్ను తన సినీ కెరీర్‌లో ఎదురైన షాకింగ్ అనుభవాల గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. సినిమాలు షూటింగ్ దశలో ఉన్నప్పుడు లేదా డేట్స్ లాక్ చేసుకున్న తర్వాత కూడా తనను సడన్‌గా ప్రాజెక్ట్‌ల నుంచి తప్పించిన సందర్భాలు ఉన్నాయని వెల్లడించారు. తాను ఎలాంటి తప్పు చేయకపోయినా కేవలం హీరోల ఇగో, భార్యల అభద్రతాభావం వల్లే కొన్ని సినిమాల నుంచి తనను తొలగించారని తాప్సీ తెలిపారు. ఒకానొక సందర్భంలో సినిమా షూటింగ్‌కు డేట్స్ అన్నీ లాక్ చేసుకున్న తర్వాత తనను ప్రాజెక్ట్ నుంచి తీసేశారని చెప్పారు. అసలు కారణం ఏంటని తాను పదే పదే ప్రశ్నించినప్పటికీ సరైన సమాధానం చెప్పలేదని, బహుశా ఆ హీరోకు తనకు ఇష్టమైన మరో హీరోయిన్‌ను తీసుకోవాలనిపించి ఉండవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు.

అయితే తనకు కెరీర్‌లో ఎదురైన వాటిలో అత్యంత చెత్త కారణం ఏమిటంటే.. "హీరో భార్యకు నువ్వంటే ఇష్టం లేదు, అందుకే నిన్ను సినిమా నుంచి తొలగించాం" అని చెప్పడమేనని తాప్సీ షాకింగ్ నిజం బయటపెట్టారు. ఒకనొక దశలో, తన సినిమాలు వరుసగా విఫలమయ్యాక, తనను అన్‌లక్కీ హీరోయిన్‌గా ముద్రవేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే, సినిమాల్లో గ్లామర్ పాత్రల గురించి మాట్లాడుతూ.. తాను మొదట్లో సినిమాల్లో నటించేటప్పుడు ఆ సన్నివేశాలు ఏ విధంగా వస్తాయో సరిగ్గా అర్థమయ్యేది కాదని అన్నారు. కానీ సినిమా తెరపై చూసిన తర్వాత కొన్ని సీన్లు మరీ ఎక్కువగా, అసహజంగా చూపించినట్లు అనిపించిందని వాపోయారు. ఏ సినిమాలోనైనా అందంగా, గ్లామర్‌గా కనిపించవచ్చు కానీ.. దాన్ని అనవసరంగా అసభ్యకరంగా చూపించడం సరికాదని తాప్సీ అభిప్రాయపడ్డారు. ఇండస్ట్రీలో హీరోయిన్లు ఎదుర్కొంటున్న ఈ తీరుపై ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి.

వ్యక్తిగత కారణాలు, తప్పుడు నిర్ణయాల వల్ల తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొన్నా

టాలీవుడ్ టాలెంటెడ్ హీరోయిన్ నివేతా పేతురాజ్ సెకండ్ ఇన్నింగ్స్‌లో వరుస అవకాశాలతో దూసుకుపోతున్నారు. కొంతకాలం సినిమాలకు దూరంగా ఉన్న ఆమె, త్వరలో 'ఆదర్శ కుటుంబం' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నివేతా తన గత జ్ఞాపకాలను పంచుకుంటూ ఎమోషనల్ అయ్యారు. 2023లో కొన్ని పొరపాట్లు, వ్యక్తిగత కారణాల వల్ల తాను తీవ్రమైన డిప్రెషన్, ఒత్తిడిని ఎదుర్కొన్నానని చెప్పారు. ఆ కష్టకాలం నుంచి బయటపడేందుకు చాలా సమయం పట్టిందని, అప్పట్లో సినిమాలను పూర్తిగా వదిలేయాలని కూడా ఆలోచించినట్లు తెలిపారు. అయితే అదృష్టవశాత్తూ పరిస్థితులు చక్కబడి మళ్లీ మంచి అవకాశాలు రావడంతో తిరిగి నటనపై దృష్టి పెట్టానని అన్నారు.

అలాగే తన కెరీర్ మొదట్లో సొంత రూపంపై అసంతృప్తితో పెదవులకు సర్జరీ చేయించుకోవాలని భావించినట్లు సంచలన నిజం బయటపెట్టారు. ఆ విషయంపై డాక్టర్‌ను సంప్రదించగా.. ఆయన గట్టిగా హెచ్చరించడంతో ఆ ఆలోచనను విరమించుకున్నట్లు తెలిపారు. సాయి పల్లవి, నిత్యామీనన్ లాంటి నటీమణులు ఎలాంటి సర్జరీలు లేకుండా తమ సహజ సౌందర్యంతోనే ప్రేక్షకులను అలరిస్తున్నారని, వారిని చూశాకే తన రూపురేఖల గురించి అనవసరంగా టెన్షన్ పడ్డానని గ్రహించినట్లు చెప్పారు. సాయి పల్లవి ఇచ్చిన స్ఫూర్తితోనే ప్లాస్టిక్ సర్జరీ ఆలోచనను పూర్తిగా మార్చుకున్నానని నివేతా స్పష్టం చేశారు. కష్టకాలం నుంచి బయటపడి ఇప్పుడు మళ్లీ బిజీ లైఫ్‌లోకి రావడం చాలా ఆనందంగా ఉందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.



నాలుగు సిరీస్‌లుగా 'రణబాలి' డాక్యుమెంటరీ..



టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ (Vijay Deverakonda) నటిస్తున్న తాజా పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'రణబాలి' (Ranabaali). ఇటీవల ఈ చిత్రం నుంచి విడుదలైన 'ఎందయ్యా సామి' (Endayya Saami) సాంగ్ మంచి టాక్‌ను సంపాదించుకున్న విషయం తెలిసిందే. ఈ సానుకూల స్పందనని మరింతగా పెంచేందుకు మేకర్స్ సరికొత్త ప్రమోషనల్ స్ట్రాటజీతో ముందుకొచ్చారు.

ఇందులో భాగంగా సినిమాకు సంబంధించిన ఓ స్పెషల్ డాక్యుమెంటరీ సిరీస్‌ను విడుదల చేయనున్నారు.

మొత్తం నాలుగు ఎపిసోడ్‌లుగా రానున్న ప్రమోషన్ సిరీస్‌లో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న (Rashmika), దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ స్వయంగా పాల్గొననున్నారు. సినిమా గురించి, ఆ కథ వెనుక ఉన్న ఎన్నో ఆసక్తికరమైన విషయాలను వారు ఇందులో పంచుకోనున్నారు. ఈ డాక్యుమెంటరీకి సంబంధించిన పూర్తి వివరాలను మేకర్స్ ఇంకా వెల్లడించలేదు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ అత్యంత భారీ వ్యయంతో నిర్మిస్తోంది. వివాహం తర్వాత విజయ్, రష్మిక కలిసి నటించిన తొలి చిత్రమిదే. దసరా కానుకగా అక్టోబర్ 16న థియేటర్లలో ఈ మూవీ భారీ స్థాయిలో విడుదల కానుంది.

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500204. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.